
# అన్నమయ్య - త్యాగయ్య




డా॥ కె. సర్వోత్తమరావు

2

# అన్నమయ్య-త్యాగయ్య

డా॥ కె. సర్వోత్తమన్, ఎమ్.ఎ.(తెలుగు),ఎమ్.ఎ. (సంస్కృతం)
పిహెచ్.డి., విద్వాన్, రాష్ట్రభాషా ప్రవీణ (హింది)
రీడర్, అన్నమాచార్య పీఠం, తెలుగు అధ్యయనశాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

పారిజాత ప్రచురణలు
6_7_554, శ్రీపురం కాలని
తిరుపతి-517 501.
1983

ANNAMAIAH TYAGAIAH

By
Dr. K. Sarvothaman

*Vijayadasami 1983*
Copies: 1000


Published by
**Sri K. Venkata Rao**
*6-7-554, Sripuram Colony*
**TIRUPATI 517 501 (A. P.)**

వెల: రూ 10-00

Cover Page: PETASRI

*Printers :* *Phone :* 10

***Sri Lakshmi Printers & Binders***
*L. B. S. Road, PILER–517 214.*
Chittoor Dt. (A. P.)



THIS BOOK IS

PUBLISHED WITH THE

FINANCIAL ASSISTANCE OF

TIRUMALA TIRUPATHI DEVASTHANAMS

UNDER THEIR SCHEME

"AID TO PUBLISH RELIGIOUS BOOKS"

# ఒక చిన్నమాట

తాళ్లపాక అన్నమయ్య సాహిత్యం గురించి పరిశీలన చాల కాలం క్రితం ప్రారంభమయిన మాట వాస్తవమే. అయితే విశ్వవిద్యాలయస్థాయిలో పరిశోధన మాత్రం సుమారు దశాబ్దకాలం నుండి అవిచ్ఛిన్నంగా సాగుతుంది. అలాగే అన్నమయ్య సాహిత్యం గురించి మాట్లాడేవారు ఒకప్పుడు నలుగురయిదుగురే. అయితే ఇపుడు దేశమంతటా ఎందరో వున్నారు.

అన్నమయ్య సాహిత్య పరిశోధన మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఈ పరిశోధనలో "తులనాత్మక అధ్యయనం" ఒక భాగం. అన్నమయ్య సాహిత్యాన్ని ఇతర వాగ్గేయకారుల రచనలతో బేరీజు వేయడం తులనాత్మక పరిశీలనలో ముఖ్యాంగం. ఈ రంగంలో అన్నమయ్య–శ్రీపాదరాయలు, అన్నమయ్య-పురందరదాసు రచనలు ఇదివరకే వచ్చాయి. ప్రస్తుతం ఈ పుస్తకంలోని మొదటి వ్యాసం అన్నమయ్య-త్యాగయ్య ఈలాంటిదే.

అన్నమయ్య తెలుగు సంకీర్తనలు మాత్రం వ్రాశాడని కొందరు పెద్దలుకూడ అనుకోవడం కద్దు. అది వారి అజ్ఞత కాదు. అన్నమయ్య సంస్కృత సంకీర్తనలకు సంబంధించిన పరిశీలన శైశవావస్థలో వుండడమే దీనికి కారణం. అంచేత అన్నమయ్య సంస్కృతసంకీర్తనల సంగ్రహ పరిశీలన రెండవవ్యాసంగా ఇందులో కూర్చడం జరిగింది.

ఈచిన్న పుస్తకాన్ని అందరూ ఆదరిస్తారని భావిస్తున్నా.

తిరుపతి
10-9-83

కె. సర్వోత్తమన్

# అంజలి

అన్నమయ్య సాహిత్యంపట్ల అభిరుచి పెంచినవారు ఆచార్య జి. ఎన్. రెడ్డిగారు, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు, శ్రీ డి. పశుపతిగారు, శ్రీ సముద్రాల లక్ష్మణయ్యనాయుడుగారు.

అన్నమయ్య సాహిత్యం గురించి వివిధ భాషల్లో విరివిగా వ్యాసాలు ప్రచురింప బడాలని ఆకాంక్షించేవారు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, I.A.S. గారు, డా॥ ఎస్. బి. రఘునాథాచార్యులవారు, శ్రీ రావుల సూర్యనారాయణమూర్తిగారు, డా॥ జి॥ నాగయ్యగారు, ఆచార్య పి. శౌరిరాజన్‌గారు.

ఈ పుస్తకం వెలుగులో రావడానికి కొంతవరకు ఆర్థిక సహాయం అందజేసిన వారు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహకులు, మాన్యులు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి, I.A.S. గారు.

నాకు కావలసిన పుస్తకాల్ని సమీకరించడంలో సహకరించినవారు డా॥ కేసర్ల వాణి, కుమారి పొన్నా లీలావతమ్మ

ఈ పుస్తకానికి అందమయిన ముఖచిత్రం గీసి ఇచ్చినవారు చి॥ శీను (పేటశ్రీ)

అతి తక్కువకాలంలో అందంగా ఈ పుస్తకాన్ని ముద్రించి యిచ్చినవారు శ్రీ లక్ష్మి ప్రింటర్స్ అధినేతలు శ్రీ జి. ఆర్. పురుషోత్తం, M. Sc., గారు.

అందరికీ వందనాలు

వినాయకచవితి
10—9—83

కె. సర్వోత్తమన్

# ఉపకరించిన రచనలు


## తెలుగు:-

అనంతరాగం (1977) రాళ్ళపల్లి అభినందనగ్రంథం. సం॥ డా॥ ఆర్వీయస్ సుందరం, రాళ్ళపల్లి అభినందన సమితి, బెంగళూరు 28

అన్నమయ్య పదకవితల్లో రామకథ (1981) జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, టి. నగర్, తిరుపతి.

అన్నమాచార్యచరిత్రము (1949) వేటూరి ప్రభాకర శాస్త్రి, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

అన్నమాచార్య సంకీర్తనామృతము (1983) సముద్రాల లక్ష్మణయ్యానాయుడు, 18-1-84, కపిలతీర్థం రోడ్, తిరుపతి.

అన్నమాచార్య సాహితీ కౌముది (1981) డా॥ ముట్నూరి సంగమేశం, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర (1961) యస్వీ జోగారావు, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు.

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము (1975) బాలాంత్రపు రజనీ కాంతరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

కడప ఊర్ల పేర్లు (1976) డా॥ కేతు విశ్వనాథరెడ్డి, నవ్యపరిశోధక ప్రచురణలు, తిరుపతి.

కడప సంస్కృతి-దర్శనీయస్థలాలు (1981) జానమద్ది హనుమచ్ఛాస్త్రి, గాంధీనగర్, కడప.

గీతగోవిందకావ్యము (శ్రీజయదేవకవి) (1982) అను॥ యల్. నారాయణ లక్ష్మీప్రచురణలు. అనంతపురం.

క్షేత్రయ్య పద సాహిత్యం (1974) డా॥ ఎస్. గంగప్ప. శశీ ప్రచురణలు. హైదరాబాదు.

తాళ్లపాక అన్నమయ్య పాటలు (1976) కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి. తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతి.

తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవ సంచిక (1978) సం॥ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి. తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతి.

తాళ్లపాక అన్నమాచార్య పదకవితల్లోని అలంకారాల పరిశీలన (1982) డా॥ కేసర్ల వాణి. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం (అముద్రితం)

తాళ్లపాక కవుల కృతులు-వివిధ సాహితీప్రక్రియలు (1974) డా॥ వేటూరి ఆనందమూర్తి. రీడర్. నిజాం కాలేజి. హైదరాబాదు.

తాళ్లపాక కవుల సాహిత్యసేవ (1979) డా॥ వి. విద్యావతి. ఈదేపల్లి మచిలీపట్టణము.

తిరుపతి సాహిత్యసమీక్ష (1979) రా. నాగభూషణం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఎం. ఎల్. లఘుసిద్ధాంత గ్రంథము.

తెలుగు జానపదగేయ సాహిత్యము (1978) డా॥ బిరుదురాజు రామరాజు. జానపద విజ్ఞానప్రచురణలు. హైదరాబాదు.

తెలుగు సాహిత్యములో దేశికవిత (1970) డా॥ ఆర్వీయస్ సుందరం. మానససరోవర ప్రచురణలు. నెల్లూరు.

త్యాగరాజు (1980) డా॥ కె. సర్వోత్తమన్. తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతి.

త్యాగరాజ కీర్తనలు విశేషవివరణలు-ప్రథమ భాగము (1975) కల్లూరి వీరభద్రశాస్త్రి, స్వధర్మస్వారాజ్య సంఘము, సికింద్రాబాదు.

త్యాగరాజ కీర్తనలు-విశేషవివరణము (రెండవభాగము) (1978) కల్లూరి వీరభద్రశాస్త్రి, స్వధర్మస్వారాజ్యసంఘము. సికిందరాబాదు.

రాయలసీమలోని ముఖ్య దేవాలయాలు (1982) పి. కృష్ణమూర్తి, గోవింద రాజనగర్, తిరుపతి.

రాధామాధవము—ఒకపరిశీలన (1978) జంధ్యాల సంధ్యాదేవి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఎం. ఫిల్. లఘుసిద్ధాంతగ్రంథము (అముద్రితము)

రాళ్ళపల్లి పీఠికలు (1978) సం॥ డా॥ ఆర్వీయస్ సుందరం, రాళ్ళపల్లి అభినందన సమితి, బెంగళూరు.-28

వాగ్గేయ కారులు-పదకృతి సాహిత్యము (1975) పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, హైదరాబాదు.

శ్రీకృష్ణకర్ణామృతము (1910) వెలగపూడి వెంగనామాత్య విరచిత ఆంధ్ర పద్య గద్య సహితము, ఆనంద ముద్రాక్షరశాల

శ్రీ తాళ్లపాక అన్నమాచార్య చరిత్రము (1981) శ్రీ పెనుమాదు వెంకటశేషయ్య, రాజంపేట, కడప జిల్లా.

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్రము (1978) శ్రీ తాళ్ళపాక చిన తిరువేంగళనాథుడు. పరిష్కర్త:— గౌరిపెద్ది రామసుబ్బశర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.

సంకీర్తన లక్షణము (1935) తాళ్లపాకవారి లఘుకృతులు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, తిరుపతి

సంగీత రత్నాకరము (1966) శార్ఙ్గదేవుడు—అను॥ గంధం శ్రీరామమూర్తి, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి, హైదరాబాదు.

సమగ్ర ఆంధ్రసాహిత్యం (6వ సంపుటం) (1965) ఆరుద్ర. యం. శేషాచలం అండ్ కో. మదరాసు.

సారంగపాణి పద సాహిత్యం (1980) డా॥ ఎస్. గంగప్ప. శశిప్రచురణలు. శ్రీనివాసనగర్. గుంటూరు_6.

## కన్నడం:-

కీర్తన కారరు (1975) హెచ్. యస్. వెంకటేశ్వరమూర్తి. సామాన్యనిగె సాహిత్యచరిత్రె. బెంగళూరు విశ్వవిద్యానిలయ. బెంగళూరు.

గానకలె (అనంతరాగం) (1977) శ్రీవిశ్వేశ్వరన్_రాళ్లపల్లి అభినందనసమితి. బెంగళూరు.

## తమిళం:-

అన్నమయ్యా ఓర్ అరిముగం (1981) పి. శౌరిరాజన్ & కె. సర్వోత్తమన్. తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతి.

## హిందీ:-

అన్నమాచార్య ఔర్ సూరదాస్ (1976) డా॥ ఎం. సంగమేశం. తిరుమల తిరుపతి దేవస్థానం. తిరుపతి.

రాధికా క్రమవికాస్ (1965) డా॥ శశిభూషణ్‌దాస్‌గుప్త

హిందీ ఔర్ తెలుగు వైష్ణవ భక్తిసాహిత్య (1974) డా॥ కె. రామనాథన్. వినోదపుస్తకమందిర్. ఆగ్రా.

## ఆంగ్లం:-

*HISTORY OF TIRUPATI* (1982) T.K.T. Viraraghavacharya, Tirumala Tirupati Devasthanams, Tirupati.

*LOVE-DIVINE-NARADA BHAKTI SUTRA* (1976) Chinmaya Publication Trust, Madras-3

*THE GREATEST COMPOSERS BOOK I & II* (*II*) Prof. P. Sambamurthy, The Indian Publishing House. Madras-1

*THE SPIRITUAL HERITAGE OF TYAGARAJA* (1957) C. Ramanujachari with Introductory thesis of Dr. Raghavan) Sri Ramakrishna Mission Students Home, Mylapore-Madras-4

# అన్నమయ్య - త్యాగయ్య

# అన్నమయ్య-త్యాగయ్య

ఆంధ్ర వాగ్గేయకారుల్లో ప్రథముడు అన్నమయ్య. ప్రసిద్ధుడు త్యాగయ్య. కొండలమధ్య పుట్టి కోనల్లో పెరిగి కొండల రాయనిపై నిండైన భక్తి నిలుపుకొన్నవాడు అన్నమయ్య.నదీతీరంలో పుట్టి నాదో పాసన చేసి చివరకు నా రాయ ణు ని లో అంతర్లీనమయినవాడు త్యాగయ్య.ఈ వాగ్గేయకారుల జీవితసంఘటనల్లో నైతేనేం రచనల్లో నైతేనేం ఎన్నో సామ్యాలు కొన్ని వైషమ్యాలు కనిపిస్తాయి.

ఒక వ్యక్తి ఔన్నత్యానికి ఆవ్యక్తి అభిజాత్యం పరిశీలించటం ఒక పద్ధతి. అన్నమయ్య తల్లిదండ్రులు లక్కమాంబా నారాయణ సూరులు. వీరు నందవరీకులు. ఈ వంశమువారు ఋగ్వేదులు. అశ్వలాయన సూత్రులు. భరద్వాజగోత్రులు. పొత్తపినాడులోని తాళ్లపాక వాస్తవ్యులు.ఈలాంటి దంపతులకు స్వామి నందకాంశంతో అన్నమయ్య సర్వధారినామ సంవత్సరం వైశాఖమాసం పూర్ణిమ

విశాఖానక్షత్రంలో (9-5-1408) జన్మించినాడు.

త్యాగయ్య తల్లిదండ్రులు సీతమ్మ రామబ్రహ్మంగార్లు. వీరు ఆంధ్రబ్రాహ్మణులు. భారద్వాజసగోత్రులు. కాకర్ల వంశీయులు. తమిళనాడులోని తంజాపురమండలం వాస్తవ్యులు. ఈ దంపతులకు సర్వజిత్‌నామ సంవత్సరం మేషమాసం శుద్ధషష్ఠీ సోమవారం (4-5- 1767) త్యాగయ్య జన్మించాడు.

అన్నమయ్యది పండితవంశమో కాదో తెలియదు. కాని తండ్రి పేరు చివర "సూరి"అనే మాటవుంది. సూరి అంటే పండితుడని అర్థం. అన్నమయ్య అయ్యదగ్గర ఏం నేర్చుకొన్నాడో అంతు పట్టదు. కాని త్యాగయ్య మాత్రం పండితవంశంలోనే పుట్టాడు. తాత గిరిరాజ బ్రహ్మం వేదవేదాంగ పండితుడు. తండ్రి రెండవ తులజాజి మెప్పు పొందినవాడు. త్యాగయ్య అయ్యదగ్గర మాత్రం కాదు అమ్మ దగ్గర కూడా చదువుకొన్నాడు.

అన్నమయ్య బాల్యంగురించి ఎక్కువ వివరాలు తెలియవు. ఒకసారి ఇంట్లోనివారు కలిసి కట్టుగా గడ్డితెమ్మని కసిరితే అడవికి వెళ్ళి తిరుపతి కెళ్ళే పరషగుంపులో కలిసిపోయి స్వామిని సందర్శించి ఘనవిష్ణువు చలవవల్ల వైష్ణవుడయ్యాడు. ఆపై ఆదివన్ శఠగోపయతుల దగ్గర వేదవేదాంగాలు నేర్చాడు. అన్నమయ్య సంగీత గురువులెవరో తెలియదు కాని త్యాగయ్య బాల్యంనుండి భక్తుడయినట్టు ఆధారాలున్నాయి. తల్లిదండ్రుల శిక్షణ, వీణా కాళహస్తయ్య, శొంఠి వెంకటరమణయ్యల ప్రాపకం త్యాగయ్యను మహోన్నత వ్యక్తిగా తీర్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే అన్నమయ్య స్వయంశిక్షణతో సుశిక్షుతుడయ్యాడని చెప్పవచ్చు.

ఇక కుటుంబజీవితం పరిశీలిస్తే అన్నమయ్యకు ఇద్దరుభార్యలు.

కొండమీద వైష్ణవుడై కూర్చొన్న అన్నమయ్యను ఇంటికి చేర్చి ఇల్లాం్రడనిద్దరిని కట్టబెట్టారు తల్లిదం్రడులు. వారే తిమ్మక్క అక్కలమ్మలు. త్యాగయ్యకుకూడా ఇద్దరు భార్యలు. ప్రథమ కళత్రం పార్వతి పరలోకం చేరుకుంటే కమలాంబను పెళ్ళి చేసుకోవలసి వచ్చింది త్యాగయ్యకు.

అన్నమయ్య పుత్రులే వారసులయ్యారు. తం్రడిపేరు నిలబెట్టినవాడు పెదతిరుమలాచార్యుడు. తాతపేరు శాశ్వతం చేసినవాడు చిన్నన్న. అయితే త్యాగయ్యకు పుత్రులులేని కొఱతను శిష్యులే తీర్చారు. గురువుగారిని గుండెల్లో నిలిపినవారు వాలాజాపేట వెంకటరమణ భాగవతర్, ఉమయాల్పురం కృష్ణ భాగవతర్, తిరువొత్తియూర్ వీణా కుప్పయ్యర్ ప్రభృతులు.

అన్నమయ్య జీవించింది 95 ఏళ్ళు. త్యాగయ్య ఈభూలోకంలో గడిపింది [illegible] ఏళ్ళు. అన్నమయ్య భక్తితో ముక్తిపొందాడు. త్యాగయ్య సన్యాసం స్వీకరించి చతురాశ్రమధర్మాన్ని పూర్తిచేశాడు. అన్నమయ్య చివరిదశ ఎక్కడగడిపాడో పరిశోధకులు తేల్చవలసిన అంశం. కాని త్యాగయ్య బృందావనం తిరువైయార్‌లో మనం ఈరోజుకూడా సందర్శించవచ్చు.

ఇక జీవితసంఘటనల్లోని సామ్యాలు చూద్దాం. అన్నమయ్య త్యాగయ్యలద్దరు భార్యలిద్దరివల్ల బాధలు పడినట్టు కనిపించదు. సాధారణంగా భక్తులకెవరికిన్ని పట్టని అదృష్టమిది. అయితే వీరిద్దరికి బంధువుల బాధలుమాత్రం తప్పలేదు. దండె భుజాన తగిలించుకొని వేళాపాళాలేకుండా పిచ్చిపాటలు పాడుతుంటే అన్నావదినెలు అన్నమయ్యను అనవసరంగా కసిరారు. అలాగే ఎపుడూ పూజాపునస్కారాలేనా అని అన్న త్యాగయ్యను నిందించడం

ఇద్దరిలోను కనిపించే సంఘటనా సామ్యం.

అయ్యో పోయెం బ్రాయము కాలము
　ముయ్యంచు మనసున నే మోహమతి నైతి
అంతహితులా తనకు నన్నలును దమ్ములును
　వంతువాసికి బెనగు వారేగాక　5.121

అన్నలంటా తమ్ములంటా ఆండ్లంటా బిడ్డలంటా
　పన్నుకొని తిరిగేరు బహురూపాలు　11.2.55

అప్పులవారే అందరును　11.3.15

అనేవి అన్నమయ్య ఆవేదనాభారాన్ని తూకం పడతాయి.

తల్లిదండ్రి భక్తి నొసగి రక్షించిరి
　తక్కిన వారలెంతో హింసించిరి　2.30

కాయ జనక నా ప్రాయములెల్లను
　మాయాపూరితులైన దాయాదులచేత
సాయపర్యంతము కాయక్లేశము చెంద
　నాయెను గాని　1.308

నాయెడ వంచన సేయకురా........
　దాయాదుల పోరైనగాని　1.465

అందరి చేతను నా బ్రతుకు లిపుడు
　నిందల కెడమాయ　2.233

ఉపకారి నేనైతె అపకారులయ్యేరు
　కృపజూచితే మిగుల నెపము లెంచేరయ్య
చపల చిత్తులు భక్తవేషులై ననుజూచి
　శతృలయ్యేరు

అనే వాక్యాల్లో త్యాగయ్య అలసట తెలుస్తుంది.

ఈకవి గాయకులిద్దరు రాజాజ్ఞను పెడచెవిపెట్టడం మరొక్క సామ్యం. అన్నమయ్య కుటుంబీకులకు ముందు రాజాశ్రయం లేదు, కాని త్యాగయ్య పూర్వీకులకు రాజాశ్రయం వుంది. అన్నమయ్యవల్ల తనకు అభ్యుదయం కలుగుతుందనుకొన్నాడు. సాళ్వ నరసింహ రాయలు.స్వామి పదాలువిని సంతసించడంతో వూరుకోక సగర్వంగా తనపై పదం పాడమన్నాడు. కాదన్న అన్నమయ్యను కారాగారంలో పెట్టించాడు. సంకెళ్లు తొడిగించాడు. అయినా ఆపదమొక్కులవాని దయతో అన్నమయ్య బంధవిముక్తుడయ్యాడు.

దొడ్డవాడ నయ్యేందుకు దొరల కొలువవలెనా 6.13

అన్నది అన్నమయ్య ప్రశ్న.

తన సన్నిధిలో ఒకపాట పాడితేచాలు 10 (వేలి) ఎకరాల భూమి ఇస్తానని రెండవ శరభోజిమహారాజు అర్థించినా ఆశపెట్టినా 'నిధి సుఖమా రామునిసన్నిధి సుఖమా' అంటూ నిర్భయంగా త్రోసి పుచ్చడం త్యాగయ్యకే తగింది.

ధనదారసుతాగార సంపదలు
ధరణీశుల చెలి మొకపదవా 2. 25

అనడం రాజసేవపట్ల త్యాగరాజుకున్న ఏహ్యాన్ని పట్టిస్తుంది.

మహిమలు ప్రదర్శిస్తేగాని మహనీయులని మానవోత్తములని అంగీకరించకపోవడం మానవమాత్రుల నైజం. ఈ వాగ్గేయకారు లిద్దరు మహిత తపస్సంపన్నులు. వీరు ప్రదర్శనకోసం మహిమలు చూపలేదు.అన్నమయ్య వరాలవల్లనే సామాన్యదండనాథుడు సాళ్వ నరసింహరాయలు సార్వభౌముడయ్యాడు. స్వామికి పుల్లమామిడి

నైవేద్యం పెట్టాననే ఆవేదనవల్ల తియ్యమామిడయింది. ఈమహిమలు జనుల్లో ప్రాకడంతో ఇహానికి పాటుపడే అలగా జనం ఎక్కువ కావడంతో 'తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు, కొసరేరు ముసరేరు కోరిక దీర్చు మనేరు తడవేరు తగిలేరు కడగి పేదుకొన్నాఁగానిమ్మరు లోకుల'ని అన్నమయ్య దైవంతో మొరపెట్టుకోవలసిన స్థితి వచ్చింది.

త్యాగయ్యకూడా అన్నమయ్యలాగే మహిమలు ప్రదర్శించాలని సిద్ధపడలేదు. ఒకవ్యక్తి మరొక వ్యక్తిపై చూపే సానుభూతి కోటి వరాలకంటె ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది. మంచంపట్టి ఆశవదలుకొన్న అన్నయ్యను ఆరోగ్యవంతుణ్ణి చేయడం, బావిలోపడ్డ భక్తుణ్ణి బ్రతికించి భార్య పసుపుకుంకుమలు నిలపడం త్యాగయ్య మహిమలుగా చెప్పుకొనే కథలు.

సగుణోపాసకులయిన భక్తుల యావదాస్తి పూజావిగ్రహాలే. ఆ విగ్రహాలు మాయమయితే పడే ఆవేదన అన్నమయ్య త్యాగయ్యలో కనిపించే మరొక సన్నివేశసామ్యం. విజయనగరరాజ్యంమీదికి కపిలేశ్వర పురుషోత్తమగజపతులు దండెత్తి వచ్చినపుడో యింకెపుడో అన్నమయ్య విజయనగరంలో వుండగానో లేదా స్వగ్రామములో వుండగానో స్వామి విగ్రహాల్ని శత్రువులు పట్టుకెళ్ళారని ఐతిహ్యం. స్థలం మార్పిడిలో కనబడలేదనడం అతికిన సత్యం. అపుడు అన్నమయ్య

### బౌళి

ఇందిరా రమణుఁదెచ్చియియ్యరో మాకిటువలె
పొంది యీతనిఁబూజించఁబొద్దాయ నిపుడు

ధారుణి మైరావణు దండించి రాముఁదెచ్చి
నేరుపు మించిన యంజనీతనయా

ఘోర నాగపాశములఁగొట్టివేసి యీతని
కారుణ్యమందినట్టి ఖగరాజ గరుడా

నానాదేవతలకు నరసింహుఁగంభములో
పొనిపట్టి చూపినట్టి ప్రహ్లాదుఁడా
మానవుఁడే కృష్ణుమహిమల విశ్వరూపు
పూని బండి నుండుకొన్న పోటు బంట యర్జునా

శ్రీ వల్లభునకు నశేష కైంకర్యములా
శ్రీ వెంకటాద్రిపైన శేషమూరితి
కైవసమైనయట్టి కార్తవీర్యార్జునుఁడా యీ
దేవుని నీవేళ నిట్టెమాకుఁ దెచ్చి యీయరే

అధ్యాత్మ సంకీర్తనలు రేకు 373

అని ఆక్రోశించాడు.

అలాగే త్యాగయ్య పగలనక రాత్రనక పాటలు పాడుతూ ఇంటి విషయం పట్టించుకోకుండా వుంటే విసిగి వేసారి అన్న జపేశయ్య త్యాగయ్య పూజా విగ్రహాలు కావేరిలో పారవేయించాడని ఐతిహ్యం. అపుడు 'నేనెందు వెదకుదురా హరి' (2–21) అని ఆక్రోశించడం అంతరాత్మను కదిలించే సన్నివేశం.

అన్నమయ్య 12 శతకాలు, ద్విపద రామాయణం, 32 వేల సంకీర్తనలు ఇంకా సంస్కృతంలో వేంకటాచల మాహాత్మ్యం, సంకీర్తనలక్షణాలు వ్రాశాడు. కాని వీటిలో శ్రీవేంకటేశ్వరశతకం, సుమారు 14 వేల సంకీర్తనలు మాత్రం లభ్యం. రోజుకు ఒక్క కీర్తనవంతున జీవితాంతం రచనలు చేపట్టిన భక్తుడు అన్నమయ్య.

త్యాగయ్య వాల్మీకి రామాయణ శ్లోక సంఖ్య దృష్ట్యా 24 వేల కీర్తనలు వ్రాశాడని అంటారు. వాటిలో ప్రహ్లాదవిజయం, నౌకాచరితం

సీతారామవిజయమనే సంగీత రూపకాలు చేరతాయో లేదో. అయినా ప్రస్తుతం సుమారు 700 కీర్తనలు.రెండు సంగీతరూపకాలు మాత్రం లభిస్తున్నాయి. నాదబ్రహ్మలో లీనమయ్యేదాకా సంకీర్తనలు పండించిన భక్తుడు త్యాగయ్య.

అన్నమయ్య నమ్ముకొన్న దేవుడు వేంకటేశ్వరుడు.ఆ వాగ్గేయకారుడు తాను దర్శించిన వివిధమూర్తుల్లోను వేంకటేశ్వరుణ్ణే దర్శించాడు. కాకపోతే అతడు దర్శించినవన్నీ వైష్ణవ క్షేత్రాలు. అతని రచనల్లో విశిష్టాద్వైతం కొన్నిచోట్ల వీరవైష్ణవరూపం దాల్చివుంది. ఆనాటికి దేశంలో ప్రబలంగావున్న వీరశైవాన్ని అణచడానికి ఈ వీరవైష్ణవం తప్పనిసరి అయింది. అందువల్లనే శివనింద మోతాదు హెచ్చినట్లుగా కనిపిస్తుంది. కాని త్యాగయ్య అద్వైతి. అతనిది ప్రధానంగా రామభక్తి. అయినా స్వపరభేదం లేకుండా కోవూరు సుందరేశ్వరస్వామి, తిరువొత్తియూర్ వడివుడైయమ్మన్,నాగలాపురం నీలాయతాక్షి, పంచనదీశ్వరస్వామి ధర్మసంవర్ధనిదేవిని నోరారా కీర్తించాడు. కంచి వరదుణ్ణి, తిరుమల వేంకటేశ్వరుణ్ణి, ఘటికాచల వాసుణ్ణి కరాలు జోడించి నమస్కరించాడు అన్నమయ్య రచనల్లో కంచి వరదరాజస్వామి,రంగనాథ కీర్తనలు కనిపించినట్టే త్యాగయ్య రచనల్లో తిరువెంకటాచలపతి సాక్షాత్కరిస్తాడు.

తెర తీయగ రాదా లోని
తిరుపతి వేంకటరమణ మచ్చరమను 1_420

వేంకటేశ! నినుసేవింపను పది
వేల కనులు కావలెనయ్య 2_179

అనేవి తిరుపతిలో పాడిన కీర్తనలు.

అంతేకాదు అతని రామభక్తి సామ్రాజ్యం విస్తారమయింది కూడా. కుమారస్వామిని 'రఘువరభాగినేయ' అని పార్వతిని 'మా వరునికి చెల్లెలివని' కామాక్షిని 'రామసోదరి' (2-176) అని ధర్మసంవర్ధనిని 'రామసోదరివై వెలసిన' (2-28) అని పేర్కొనడంలో ఈవిషయం స్పష్టమవుతుంది. అంచేతనే 'శివ మాధవ భేదము చేయరాదు' (2-54) అని హెచ్చరించాడు త్యాగయ్య. కొందరు అతి పరిచయంతో శ్రీ వేంకటేశ్వరస్వామిని 'జాతర దైవాల సరిగా' చూడడాన్ని అన్నమయ్య నిరసిస్తే అచ్చం ఈలాగే త్యాగయ్య కూడా రాముడొక్కడే దేవుడని నీ మనసు నీ సొగసు నీ దినుసు వేరే_తామసమత దైవమేల'(2-155) అని నిందించడం గుర్తుంచుకోదగ్గ సామ్యం.

అన్నమయ్య త్యాగయ్య రచనల్లో నవవిధభక్తులు కనిపిస్తాయి అన్నమయ్య "ఉన్మాద,పతివ్రతా,విజ్ఞాన, ఆనంద, రాక్షస, తురీయ, తామస, వైరాగ్య, రాజస, నిర్మల భక్తి భేదాలను (7-235) పేర్కొన్నాడు. అంతేకాదు అన్నమయ్య దృష్టిలో 'కైవల్యమునకంటె కైంకర్యమెక్కుడు' (7-249) కాని సూక్ష్మంగా తులనాత్మకంగా పరిశీలించినపుడు అన్నమయ్యలో రాజసప్రవృత్తి ఎక్కువేమోనని పిస్తుంది. ఈ రాజసం ఎదుటివారిని గౌరవిస్తుంది. అదే సమయంలో అవసరమయితే గర్హిస్తుంది. అయినా స్నేహంలో వీటిని లెక్కపెట్ట నవసరంలేదు. అందువల్లనే అన్నమయ్య

నీకు నీవే వలసితే నీవే నన్నుఁగాచుకొమ్ము 10.78
నేరుపున నాకైతే నీ దిక్కుకలదుగాని
చేరి నీ కావల దిక్కు చెప్పి చూపఁగలదా 10.57
నిన్ను నీవే తెలుసుకో 10_114

అని అనగలిగాడు.

కాని అన్నమయ్య తానన్నదానికి పశ్చాత్తాపపడిన సందర్భాలున్నా లేకపోలేదు.

చిత్తానఁబెట్టకు మీ మాట శ్రీ రమణ మరవకు
హత్తి నిన్నెఱుఁగుదు నజ్ఞాని నేను 7.103

అల్పశక్తివాఁడ నేను అధికశక్తివి నీవు
పొల్పనెంత పనికిఁ బూనితి నయ్యా 7.156

ఎట్ట వలసినఁజేయు మిన్నియు నీ చిత్తమే
నెట్టన నొకఁడనా నీవే యింతను 7.222

నావల్ల నీకేమున్నది నారాయణ నీవు నన్ను
కావించి రక్షించే వుపకార మింతేకాక 7.250

ఈ మాట గర్వముగాదు నీ మహిమే కొనియాడితిఁగాని
నేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాఁడఁగాను
నేమాన ఁడాదేవాఁడను నేరము లెంచకుము 7.104

త్యాగయ్యది సాత్త్వికభక్తి. ఈ అంశాన్నే వాచ్యంగా

'భక్తి బిచ్చమీయవే–భావుకమగు సాత్త్విక
భక్తి బిచ్చమీయవే' (2–46)

అని స్పష్టంచేశాడు. అందుకే రాజసగుణము మానితి–3 అంటూ రాజస జనులతో జతకూడకుండా వుండడాన్ని తన అర్హతగా చెప్పుకొన్నాడు. అన్నిటికి మించి అన్నమయ్య

'నేనొక్కఁడ లేకుండితే నీకృపకుఁ బాత్రమేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు (8-48) అని అంటే

త్యాగయ్య పొగడకుంటే నీకేమి కొదవో (2–22) అనడంలో సాత్త్వికత వ్యక్తపడుతుంది.

'నీవులేక త్యాగరాజు నీ గుణముల నెటు బాడును' (కీ 1_462)

అని త్యాగయ్య బాధపడడం హృదయస్పర్శిగా వుంది.

కీర్తనల్లో వైయక్తిక విషయాలు ప్రస్తావించేటప్పుడు కూడా ఈ భేదం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. తన రచనల్ని అనుకరించేవారి నుద్దేశించి అన్నమయ్య

'వెఱ్ఱులాల మీకు వేడుక కలిగితేను
అఱ్ఱువంచి తపుకల్లంగరాదా'

ముడిచివేసిన పువ్వు ముడువ యోగ్యముగాదు
కుడిచి వేసిన పుల్లె కుడువఁగా (గాదు

బడినొకరు చెప్పిన (బ్రతి చెప్పఁ బోతేను
అడరి శ్రీహరి కది అరుహము గాదు

వుమిసిన తమ్మలో నొక కొంత కప్రము
నమకూర్చి చవిగొని చప్పరించనేల

అమరఁగ ఛాయాపహారము సేసుక
తమమాట గూర్చితే దైవము నగఁడా 7-260

అని ఉక్రోషంతో నిందిస్తాడు.

'నరసింహా రామకృష్ణ నమో శ్రీవేంకటేశ' సంకీర్తనల్లో తన శత్రువుల్ని చావగొట్టి సంహరించమంటాడు. కాని త్యాగయ్య మాత్రం తనపట్ల అపచారం చేసినవారిని, అకృత్యానికి సిద్ధపడినవారినిగూడా ఏమీ అనకుండా

"ఎన్నో తప్పులు చేసిన వారిని రాజన్య నీవు ప్రోచినావు"

అంటూ వారిని క్షమించమనడం సాత్త్వికతకు ఎత్తిన కరదీపం.

అన్నమయ్య త్యాగయ్యలు అభినివేశంతో వర్ణించిన అవతారాలు మూడు నారసింహ-శ్రీరామ-కృష్ణావతారాలు. అన్నమయ్యలో నారసింహకీర్తనలు సుమారు రెండువందలు కనిపిస్తే త్యాగయ్యలో రెండే రెండు కీర్తనలున్నాయి.

"నరసింహ్వా నను బ్రోవవె శ్రీలక్ష్మి" 1_449
"శ్రీనారసింహ్వ మాం పాహి" 2 173

అనే సంకీర్తనలు స్వాములవారు ఘటికాచలవాసునుద్దేశించి పాడినవి. అన్నమయ్య నారసింహకీర్తనల్లో అహోబల నరసింహకీర్తనలెక్కువ. ఆదివన్ శఠగోప యతుల దగ్గర శిష్యరికం వల్లను, అహోబలవాసంవల్ల అన్నమయ్య నరసింహుణ్ణి బహుధా కొనియాడి వుండవచ్చు. అంతకంటెకూడా నరసింహ మంత్రోపాసన కారణంగా 32 వేల కీర్తనలు అన్వర్థంగా వ్రాశాడని శ్రీ గౌరిపెద్దివారి అభిప్రాయం. త్యాగయ్య ప్రహ్లాద భక్తి విజయంలో కూడా నరసింహునికి ప్రాధాన్యమివ్వలేదు. ప్రహ్లాదునికి నారాయణరూపంలో సాక్షాత్కరించినవాడు రాముడు కావడం త్యాగయ్య ప్రత్యేకత.

ఇక రెండవదయిన శ్రీరామావతార కీర్తనల్లో పోలికలిద్దరికి వున్నాయి. అన్నమయ్యకు రామావతారంపై ప్రత్యేక అభినివేశం వుంది. అదీగాక అతడు ద్విపద రామాయణకర్త కూడా. అన్నమయ్య సంకీర్తనల్లో దాదాపు రెండువందల రామాయణ కీర్తనలున్నాయి. శ్రీ రామకృష్ణానందస్వాములవారి ఆదేశంతో రామషడక్షరీమంత్రాన్ని తొంబైయారుకోట్లు జపించి త్యాగయ్య ధన్యుడయ్యాడు. రాముణ్ణి పరబ్రహ్మ స్వరూపంగా భావించడం ఇద్దరిలోను సమానం. అన్నమయ్య

"ఇతఁడే పరబ్రహ్మ మిదియె రామకథ 11-1-224
భవుఁడెంచు (దారక బ్రహ్మ మీతఁడు" 11-1-219

అని పేర్కొన్నాడు. త్యాగయ్య "పాహి కల్యాణరామ" కీర్తనలో పరమైన బ్రహ్మము పాహిసింహము(1–132)అని "ఏలనీదయ"కీర్తనలో "యోగీంద్ర సుహృద్భావిత ఆద్యంతరహిత" (11-344) అని "దుడుకుగల" కీర్తనలో అవాఙ్మానసగోచర (1-229)అని జగదానందలో అవికృత త్యాగరాజసన్నుత (1–225)అని శ్రీ రామరామ సంకీర్తనలో "అఖండరూప"(1-181)అని "సుందరతరదేహం"లో శివం అద్వైతం అమలం (2-224) అని స్వర లోక"కీర్తనలో "కేశనుతాంత నామరూప రహిత" (1-185) అనడం గుర్తించవచ్చు.

రామాయణ సన్నివేశాల్లో అన్నమయ్య త్యాగయ్య లిద్దరు మెచ్చింది పుష్పకయానవృత్తాంతం, పట్టాభిషేక వర్ణనం. అంతేగాక రామనామమహిమను ఇద్దరు సరిసమానంగా వర్ణించారు. అన్నమయ్య

"సకల సంగ్రహము సకల సంచయము
అకృత సుకృతమిది హరినామం" 2-334

జపియించరే సర్వజనులు యీ నామము
తపరపమువో పుణ్యులకు రామనామము 2-32

అని రామనామ విఖ్యాతి చెప్పాడు, అలాగే రామనామ మాహాత్మ్యాన్ని విశదంచేసే త్యాగయ్య కీర్తనలెన్నో.

చ: మేను గలిగినందుకు సీతారామ
నామమే పల్కవలెను 1-333

మేలుమేలు రామనామ సుఖమీ ధరలో మనసా 2-96
తెలిసి రామచింతనతో నామముసేయవె ఓ మనసా 1-422

రామ నీయెడ ప్రేమ రహితులకు
నామరుచి తెలుసునా 2-127

భజన సేయరాదా
అజరుద్రాదులకు సతత మాత్మమంత్రమైనరామ 2-50

సుఖి యెవరో రామనామ సుఖియెవరో
నామకుసుమములచే పూజించే
నరజన్మమే జన్మము 2-238

రామనామం భజరే మానస 1-154

**ఇంతేకాకుండా పార్వతి ప్రశంసించిన రామనామాన్ని ఇద్దరు అనేకచోట్ల వ్యక్తంచేశారు.**

అన్న: కాత్యాయని నుత కలితనామునకు 1-46

త్యాగ: భక్తిలో శ్రీరామభక్తి మేలని శివ
భక్తి సంతతము విరక్తితో నుతిఁజేయ 2-19

**అన్నమయ్య త్యాగయ్యల సంకీర్తనల్లో కృష్ణభక్తి భిన్నరూపాల్లో కనిపిస్తుంది. అన్నమయ్యకు కృష్ణుడు పూర్ణరూపుడు. త్యాగయ్యకు రాముడే పూర్ణావతారుడు. రఘుపతేరామ అనే సంకీర్తనల్లో** "పరిపూర్ణావతార పరభామినీదూర"**(2-110)అని పేర్కొవడం దీనికి సాక్ష్యం.** పైగా పది వేషములలో రామవేషము బహుబాగు **(2-58) అన్నాడు. అన్నమయ్య సంకీర్తనల్లో బాలకృష్ణ సంకీర్తనలు, రాసలీలాదులెన్నో వర్ణింపబడ్డాయి. త్యాగయ్య నౌకావిజయంలో రాసలీలవర్ణన వుంది. త్యాగయ్య సంకీర్తనల్లో రెండుచోట్ల బాలకృష్ణాభివర్ణనం కనిపిస్తుంది.**

వెన్నమీగడల వేడ్కఁ మీరఁదను
కన్నపిల్లవాండ్ల కడుపునించి
తిన్నగా వెలయు దివ్యరూపమా
చిన్నికృష్ణ 2-36

అన్నమయ్య వేంకటేశ్వరుని ఉత్సవాల్ని తనివితీరా వర్ణించి నట్లే త్యాగయ్య శ్రీరంగనాథుని తిరునాళ్లను మనసారా కీర్తించాడు.

రాజు వెడలె చూతాము_రారె కస్తూరి రంగ
తేజి నెక్కి సామంత రాజు లూడిగము సేయ
తేజరిల్లు నవరత్నపు దివ్యభూషణములిడి రంగ
కావేరీ తీరమునను పావనమగు రంగపురిని
శ్రీ వెలయు చిత్రవీధిలో వేడ్కగ రాగ
సేవను గని సురలు విరులచే ప్రేమను పూజింపఁగ
భావించి త్యాగరాజు పాడగ వైభోగ రంగ 2-119

అన్నమయ్య కావేరి రంగని కీర్తించినట్లే త్యాగయ్య తిరుమలేశుని దర్శించి ధన్యుడయ్యాడు.

జానపదుల్లో వ్యాప్తమయిన అంశాన్ని కీర్తనల్లో పొందుపరచడం ఇద్దరిలోను సమానం.

తల్లి యశోద చందమామ పాట పాడుతూ బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తుంది. కృష్ణుడొక కొంటెపని చేయదలచుకొన్నాడు. తల్లి చందమామను పిలుస్తుండడంవల్ల కృష్ణుడు చంద్రుని చూసి సైగ చేశాడు. ఆ చంద్రుడు కిందికి సరాసరివచ్చాడు. తల్లి దిగ్భ్రమ పడింది. ఈసన్నివేశం ఏ పురాణంలోనూ లేదు.

చందమామఁబాడి తల్లి సరిఁబొత్తుకు రమ్మంచే
చందురుఁజూచి కృష్ణుఁడు సన్నఁజేసెను
ముందర చంద్రుడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యంటినో యని మరచి వెరగందెను 10_285

ఈలాగే భాగవతములోలేని నౌకాయాన వృత్తాంతాన్ని ఒక రూపకంగా

తీర్చాడు త్యాగయ్య.

గోపికలు నౌకాయానం చేయాలని అనుకొంటారు. కృష్ణుని తమతో తీసుకొని వెళ్ళడమా వద్దా అని సందేహిస్తారు. చివరకు కొంటెపనులు చేయవద్దని తమ వెంబడి రమ్మంటారు. నౌక కదులుతుంది. కృష్ణుడు బృందావనంలో విహరించినట్టే అందరితోను తానొక్కొక్కడుగా విహరిస్తాడు.గోపికలు తమ సౌందర్యానికి మిడిసిపడతారు. వారి గర్వాన్ని అణచడానికి కృష్ణుడొక పన్నాగం పన్నుతాడు పడవ నదిమధ్య కదులుతుంటే తుఫాను వీస్తుంది. వర్షం హోరున కురుస్తుంది. అందరూ తడిసి ముద్దయిపోతారు. పడవ చిల్లులుపడి నీటిమట్టం పెరుగుతుంటుంది. చివరకు గోపికలందరు కాపాడవలసిందిగా ప్రార్థిస్తారు. కృష్ణుడు వారిని కాపాడుతాడు. కృష్ణునిలో బాలత్వానికన్నా బ్రహ్మత్వం నిలపడం ఇందులోని విశేషం.

కం॥ నదినె కాదు జలనిధి
గానగు భవవార్ధి నిపుడు కడువేగమునన్
మానినులార సురాసుర మానవుల
దరింపఁజేయు మాధవుగానే (1-71) అని కృష్ణుడనడం

దీనికి సాక్ష్యం.

అన్నమయ్య త్యాగయ్య రచనల్లో మధురభక్తి పరిశీలించదగ్గది. మధుర భక్తి శృంగార సమ్మిళితం కావడమొక ధర్మం. తన్ను నాయికగా భావించుకొని పరమేశ్వరుణ్ణి నాయకునిగా తలపోసి భక్తిని శృంగారరూపంలో వ్యక్తం చేయడం దీని విశేషం. చైతన్యుల పంథా ద్వారా ఈ భక్తి విస్తరిల్లింది. అన్నమయ్యలో ఈ భక్తి ప్రవాహం గట్లొరుసుకొంటూ ఉరవడిగా సాగడం గమనించవచ్చు.పరమాత్ముడు

భక్తుడు అనే స్థితిభేదం మరచిపోతే అన్నమయ్య సాహిత్యంపట్ల అపోహ కలగడం ఖాయం.

అన్నమయ్యలో శ్రుతిమించిన శృంగారం కనిపిస్తే శుచిత్వంతో కూడిన శృంగారం త్యాగయ్యలో కనిపిస్తుంది. ఉదాహరణకు శ్రీరామ జయరామ కీర్తనలోని 'పంకజనయన! నా కుంకుమ నీవే (1-174) రామ మేఘశ్యామ పాహి కీర్తనలోని 'తలచినంతనే మేను పులకరించగ నీపై వలచి నీవాడ నైతిని (1-156) అనేవి గుర్తింపదగ్గవి. "చూతాము రావె" సంకీర్తనల్లో

'మనసను చెలి నీకే మరులు కొన్నది గాని
చనవున చెయిబట్టి సంరక్షించవు
కమనీయమగు పాన్పుగావించితి నందు
రమియింపకనె నన్ను రచ్చచేసేవు' 1-150

అనేవి సంభోగ శృంగారానికి దగ్గరిలో సాగిన వర్ణన.

తలచితి నీలవర్ణ సుశీల
చలమిక నేల స్వామి నేఁదాళ
మమతమించి నీదుపైని
మరులు కొన్న నేను 1-110
తలచిన నిన్ను గొలచిన ఎంత
వలచిన దాగ పిలిచిన పలుకవేమి 1-1-30

అనడంలోను మధురభక్తి ప్రస్ఫుటమవుతుంది.

వాత్సల్యాసక్తిని నారదమహర్షి భక్తివిభేదంగా పేర్కొన్నాడు. తన్ను తల్లిగా భావించుకొని దేవుణ్ణి శిశువుగా వూహించుకొనడం, తన్ను శిశువుగా భావించుకొంటూ తల్లి వాత్సల్యానికి పరితపించడం వాత్సల్యభక్తిభేదాలే.

మొత్తకురే అమ్మలాల ముద్దులాఁడు వీఁడే
ముత్తెము వలె నున్నాఁడు ముద్దులాఁడు

చక్కని యశోద తన్ను సలిగతో మొత్తరాఁగా
మొక్కబోయీ ఁగాళ్లకు ముద్దులాఁడు
వెక్కసాన రేపల్లె వెన్నలెల్లా మాపుదాఁకా
ముక్కున వయ్యగఁ దిన్న ముద్దులాఁడు

రువ్వెడి తాళ్లఁదల్లి రోలఁదన్నుఁ గట్టెనంటా
మువ్వల గంటలతోడి ముద్దులాఁడు
నవ్వెడి ఁజెక్కులనిండ నమ్మిక బాలుని వలె
మువ్వురలో నెక్కుడైన ముద్దులాఁడు 4-142

పరమాత్ముడయిన బాలుని చిలిపిచేతలకు పరవశించే మాతృ వాత్సల్యం అన్నమయ్య కీర్తనలో కనిపిస్తుంది

గోపికలు కృష్ణునిపై నీలాపనిందలు వేస్తూ యశోద దగ్గరికి చాడి చెప్పడానికి వచ్చినపుడు తల్లి హృదయం పరితపిస్తుంది. వెంటనే యుక్తివాదంతో క్రింది కీర్తనలో వాళ్ళనోరు మూయిస్తుంది.

కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీ వలెనె కంటి నెయ్యమైన బిడ్డని
బాయిటఁ దారవేసిన పాలు వెన్నలును
చేయి వెట్టకుందురా చిన్ని బిడ్డలు
మీయిండ్లు జతనాలు మీరు సేసికొనక
పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని

మూసిన కాఁగుల సేయీ ముంగిటి పెరుగులూ
ఆసపడకుందురా ఆదే బిడ్డలు

వోసరించి మోసపోక వుండలేక మీరు
సేసే రింతేసి మూరు చెప్పరాని బిడ్డని

చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులను
చిక్కిన విషతురా చిన్ని బిడ్డలు
మిక్కిలి పూజలుసేసి మెచ్చించఁదగదా
యెక్కువైన తిరువేంకటేశుఁడైన బిడ్డని 12-253

"సీతమ్మ మాయమ్మ (2-234) కీర్తనలో రాముని తండ్రిగా సీతమ్మను తల్లిగా నిర్దేశిస్తూ తన్ను ఒక కుటుంబంలోని వ్యక్తిగా నిరూపించుకొంటాడు త్యాగయ్య "నా యెడ వంచన" (1-465) అనే కీర్తనలో

వాదాడుచు బాలురు యెచ్చటివాదో నిలురా బుద్ధి
లేదా యన తాళిమిఁగలవారై తలిదండ్రులు చూచి

మోదముతో తనయులనుచును ముద్దుబెట్టి కౌగిలిఁజూర్ప
లేదా యటునేగాదా బ్రోవవే

అని పేర్కొన్నారు. ఇవేగాకుండా ఇద్దరి రచనల్లోను తల్లి బిడ్డ ఉపమానాలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

అన్న: పెనగి తల్లికడ బిడ్డలు భువిలో
ఎనగొని ఎక్కడి కేగుదురయ్యా 5-269

బిడ్డలేమి యియ్యఁగాను ప్రేమముతో గన్నతల్లి
వెడ్డువెట్టి చన్నిచ్చి పెసం బెంచును 2-39

కన్నతల్లి బిడ్డలకు కాచుక పెన్నయుఁడాలు
వన్నెము నిడి రక్షించి నటువలెను 7-109

✓ తనయుని బ్రోవ జనని ఒప్పునో
తల్లివద్ద బాలుడు బోనో 1-415

కోపగించి చంకబిడ్డ గోరి తల్లడించితేను
పైపైనే పట్టుఁగాక పాసి పొయ్యీనా 7-166
తల్లిఁగోపించి మొత్తినఁదనయుఁడు తల్లి కొంగే
మెల్లగాఁబట్టి పెనఁగి యేడిచినట్టు 7-221

త్యాగ: తల్లి దండ్రిఁ బ్రోవకుంటె
తనయునికే ద్రోవ 1-137

తల్లి గొట్టితే సరగున బాలుడు పద
పల్లవముల విడచునా 1-66

తనయుఁడాడుమాట తల్లి దండ్రుల
కవి యాట గాదా 1-390

సుతుని మాటకు తల్లిదండ్రులు య
సూయ పడుట కలదా ఓరాము 2-144

తనయుని ఏజాతియైనఁబ్రోవని
తల్లియు భువిని గలదా ఓరాము 2-144

అన్నమయ్య త్యాగయ్య సంకీర్తనల్లో భావసాదృశ్యాలెన్నో కని పిస్తాయి. వాటిలో మొదటిది గురుభక్తి ప్రదర్శనం. అన్నమయ్యకు వైష్ణవం ప్రసాదించినవాడు ఘనవిష్ణువు. వేద వేదాంగాలు నేర్పినవాడు ఆదివన్ శఠగోపయతి. అన్నమయ్య కీర్తనల్లో బహుధా ప్రశంసించిన యతీంద్రులు నమ్మాళ్వారు. (2–117) భాష్యకారులు. (7–138)

గురువు గలవానికి కొరత ఏమియు లేదు 7-20

మిక్కైన గురువుకంటే మీద రక్షకుండు లేడు 5-268

అన్నియును దగ నాచార్యాధీనము 6-90

వైష్ణవుండై యాచార్యసేవ సేయుటే బుద్ధి 6-195

చివికి కర్మంబనెడి చిచ్చు చొచ్చిన నాకు
జవళి నాచార్యకృప జలధియే దిక్కు 6-146

త్యాగయ్య గురువులలో "నా ర ద గు రు వు" ప్రముఖుడు. త్యాగయ్యకు స్వరార్ణవం ప్రసాదించినవాడు నారదుడని ఐతిహ్యం. అంచేతనే కీర్తనల్లో త్యాగయ్య నారదుని వేనోళ్ళ కీర్తించాడు.

రంజిల్లు వీణకల్గు గురురాయ
శ్రీనారద నాద సరసీరుహభృంగ శుభాంగ 2-192

వరనారద నారాయణ 2-1 2

గురువు గొప్పదనాన్ని త్యాగయ్య కీర్తించిన విధమిలావుంది.

గురువులేక ఎటువంటి గుణికి తెలియగ 2-242

శ్రీ గురు చరణములే గతి యనిన
గురువే చిల్లగింజ గురువే భ్రమరము
గురుదే భాస్కరుండు 2-1

అన్నమయ్య త్యాగయ్యల కీర్తనల్లో రాజసేవా తిరస్కారం మాత్రంగాక ధనిక నిరసనం. అధికార నిరసనం సమానంగా కనిపిస్తుంది.

అన్న: మనుజకీటముల మరెవ్వడెరుగు 8-258

పసురమై వెతలేని పాటుపడవచ్చుగాక
కసివో నొరుల పొగడగా వచ్చునా 5-223

తలరాయిగాగ నెందరికి మొక్కెడిని
తెలివి మాలిన యట్టిదేహి
కాలీచ పడగ నెక్కడికి నేఁగెడిని
పాలు మాలిన యట్టి ప్రాణి 1-201

పొది పరస్తుతి పుణ్యము కంటె
పాదుగ హరి (దిట్టే పాపము మేలు 9-240

త్యాగ: కొంచెపు నరులను నుతించను నావల్లనుగాదు 1-214

ధన మదమున నుంతు జనులను నేను యా
చనసేయగ లేనురా 1-362

ఊరక ధనిక సంభాషణను నేనొల్ల
వెనక ముందు తెలియని యా
ధనికుల వెంబడి తిరుగుదురు 1-298

అన్నమయ్య త్యాగయ్యల రచనల్లో కలికాల నింద సమానంగా కనిపిస్తుంది. కలిమహిమల్ని ప్రజల బాధల్ని చెప్పడంతో వారు తృప్తి పడలేదు. సమాజంలో తాము కూడ భాగస్థులు కావడం వల్ల దేవుణ్ణి నిలదీసి అడిగారు.

తలిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయ చెప్పనేఁడు కలకాలమహిమ

దేవాలయాలు నానాదేశములెల్లాఁజొచ్చి
దేవగా నెట్లుండిరో దేవతలు
తావులేక రాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయ కలికాల మహిమ

నిరపరాధుల జంపినెత్తురు వారించగను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తను లుండే విపరీత కాలమున
గరువాలుం గపటాలె కలికాలమహిమ

తలలు వట్టీడువఁగా తల్లులు బిడ్డలలేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కులు గోయ మరుఁడెటు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ

పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁదమలోఁబ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవేమెరుగుదువు
కలుషమే ఘనమాయఁగలికాలమహిమ 11.133

తన చిన్ననాటనో లేదా ఎపుడో కలిగిన రాజోపప్లవ సందర్భంలో తురుష్కులు జరిపిన దౌర్జన్యాన్ని హింసాకాండను ఈ కీర్తనలో వర్ణించాడు. బాధ పడిన ఆభక్తుని మనసు

నీ దాసుల భంగములు నీవు చూతువా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా
కడు నీ మహిమము నెరపెడి సమయము
వాఁడి మెరసి యిటు వరదుఁడ గావే 6.184

అని ఆక్రోశించింది.

"కాలవిశేషమో లోకముగతియో సన్మార్గంబుల
కీలు వదిలె సౌజన్యము కిందయిపోయినది

ఇందెక్కడి సంసారం వేదెసఁజూచిన ధర్మము
కందయినది, విజ్ఞానము కడకుఁదొలంగినది
గొందులు దరిఁబడె శాంతము కొంచెంబాయ, వివేకము
మందుకు వెదకిన గానము మంచితనంపుఁ బనులు

కొఱమాలెను నిజమంతయు, కొండలకేఁగెను సత్యము
మఱఁగై పోయెను వినుకులు, మతిమాలెను తెలివి'' 1-63

అనడంలోని అన్నమయ్య లోకావేదన మన అందరి ఆవేదనకూడా.

త్యాగయ్య అంతటి సాత్త్వికుడు కూడా జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక పోయాడు.

ఏది నీ బాహు బలపరాక్రమ మెన్నాళ్ళ కెన్నాళ్ళు
ఆదిదేవ నిజదాసులకుఁగన నాసయుండగా కరివరదా

కరమున మెరసే శరచాపము ఆకలిగొనలేదా
మురఖరశోణిత పానము బహుదినములుగాలేదా వాదా
సరస భూసురుల బాధలు విని రోసమురాలేదా
మొరలిడఁగా యోగనిద్దుర నిలిపి, మోముఁజూపరాదా వాదా
వరుస తప్పు బుద్ధులు నీచులకు వచ్చినది తెలియదా
వెరపు లేక తిరిగేరు చాలనుచు వేగమే శ్రీ త్యాగరాజసన్నుత 1-330

అన్నమయ్య త్యాగయ్యలకు అభిమతమయిన అంశాల్లో జన్మభూమి వర్ణన చెప్పుకోవలసివుంది. అయితే అన్నమయ్యకు పుట్టిన వూరుపై కంటె మెట్టిన వూరుపై అనురక్తి ఎక్కువ అంచేతనే తిరుమల తిరుపతుల్ని మనసారా కీర్తించాడు. కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ, (9-182) అదెచూడు తిరువెంకటాద్రి(5-130) "తిరుమలలో ఒక్కరాత్రి వుంచేవాలు'' అనేవి ఆ భాగవతోత్తమునికి ఆ ప్రదేశం పట్లగల ప్రయత్నాన్ని స్పష్టపరుస్తుంది.

త్యాగయ్య "మురిపెము కలిగెగదా" అనే కీర్తనలో 'ఈ మహిమలో సొగసైన చోళసీమ (2-87) అన్నాడు. ఏ పాపము చేసితిరా (1.332) కీర్తనలో

నాదరూపుడవని వినినే శ్రీ
నాథ నిన్ను నమ్మితిని
నాదాపురమున నుండియు న
న్నాదరించక యూరకుండుటకు
నేనే పాపము చేసితిరా

అనడంలో నాదాపురము నా–దాపురమనే విభాగాన్ని సరసులు గుర్తించవచ్చు ఆలాగే సారి వెడలిన యీ కావేరిని జూడరే (2-232) కీర్తనలో కావేరి ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించాడు. పాపులు పుణ్యులనే భేదంలేక అందరిని పునీతుల్ని చేస్తూ తీవ్రమందగమనంతో గట్టుకు ఇరుపక్కలవున్న వనాల్లోని కోకిలలు కుహుకుహు మంటుంటే శ్రీరంగనాథుణ్ణి దర్శించి పంచనదీశ్వరుణ్ణి సేవించడానికోసం కావేరి వస్తున్నదని వర్ణించాడు.

కనుగొను నీ విగ్రహమే గ్రహబలమిది నాకు (6.109) అనే అన్నమయ్య కీర్తన భావం త్యాగయ్యలో

గ్రహబలమేమి శ్రీరామానుగ్రహ బలమే బలము
గ్రహబలమేమి తేజోమయ వి
గ్రహమును ధ్యానించే వారికి నవ 1-395

రూపంలో కనిపిస్తుంది.

దేవుఁడా నాదేహమె నీకు తిరుమల గిరిపట్నము
భావింప హృదయ కమలమె బంగారుమేడ 2-355

తనువే గుడియట తలయే శిఖరమట
వెను హృదయమే హరి పీఠమట 6-82

అనే అన్నమయ్య వాక్యాలలాగే త్యాగయ్య

'తనువే నీ కనువైన సదనమురా రఘునాథ
స్థిరచిత్తము వర చామీకర పీఠము రఘునాథ' 1-127

అని వ్రాశాడు.

ఉనికి మనికి నీవే వుపమ నీవే 11-1-43
ఉపమెుక్కటే నీవే వున్నతుడ వంట 11-1-100
ఉపమ నేరుతువె వొద్దికతో 13-66

అనేవి అన్నమయ్య ప్రతిపాదనలు.

ఉపమ తనకు లేక యుండవలెనని
ఊరయూర తిరగరాదు 2.296

అనడం త్యాగయ్య పద్ధతి.

నీతినియమాల్ని ఇతరులకు బోధించడం కన్న ముందు తమకు అన్వయించుకొని నడిచే వారినే మహాత్ములుగా లోకం కీర్తిస్తుంది. అందువల్లనే అన్నమయ్య త్యాగయ్య లిద్దరును మనసుకు బోధ చేసిన రీతిలో ఎన్నోకీర్తనలు వ్రాశారు. అవి వైయాక్తికాలుగా పైకి కనిపించినా ఆలోచించే ప్రతి వ్యక్తికి అన్వయించేవి.

అన్నమయ్య:

భావములోనా బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువరో మనసా 9 272

మాయల (బొరలగ నేటికి మనసా 9-115
సారకుమీ వోమనసా

పంతము విడువకుమీ మనసా 2-177

త్యాగయ్య:

చక్కని రాజ మార్గములుండగ
సందుల దూరనేల ఓ మనసా 1–396

మనసా ఎటులోర్తునే నామనవి చేకొనవే 2-60
మనసా శ్రీరామచంద్రుని మరవకే ఏమరకే 2-61

మనసు నిల్ప శక్తి లేకపోతే
మధుర ఘంటవిరుల పూజలేటికి 2-63

మనసు విషయ నటవిటుల కొసంగితే
మా రాముని కృప కల్గునో మనసా 2-66

మనవ్యాలకించరాదటే
మర్మ మెల్ల దెల్పెదనే మనసా 2-68

మేనుజూచి మోసపోకుమీ మనసా 2-95
యజ్ఞాదులు సుఖమను వారికి సము
లజ్ఞానులు కలరా ఓమనసా 2-103

వినవే ఓమనసా వివరంబుగ నే దెల్పెద
మనసెరింగి కుమార్గమున మరిపారలుచు చెడవలదె
2-174

అన్నమయ్య త్యాగయ్యలు రచించిన పాటల్లో స్ఫుటమయినవి, అస్ఫుటమయినవి అయిన సాదృశ్యాలకంటె ముఖ్యంగా శైలీసాహిత్య నిర్మాణంలోని నైపుణ్యం పరిశీలించినపుడు త్యాగయ్యకు అన్నమయ్య రచనలు మార్గదర్శకాలని చెప్పక తప్పదు. పల్లవిలో ముఖ్యోద్దేశ్యంతెలిపి తదనుగుణమయిన భావాలు, ఉదాహరణాలు, సామ్యాలను చరణాలలో విస్తృతపరచడం ఈలాంటివే. అన్నమయ్యలాగే

త్యాగయ్యకూడా స్త్రీలలో భక్తి మతం నిలదొక్కుకోవడానికి వీలుగా మేలుకొలుపులు, జోజోలు, పవళింపు పాటలు, శోభనం పాటలు, హారతి పాటలు వ్రాశాడు.

ఇంక వీరిరువురి రచనల ఎత్తుగడల్లోని సామ్యాలు పరిశీలిద్దాం.

'నీ వంటి దైవాలు లేరీ నిఖిల లోకములందు' 10.240 అనడం అన్నమయ్య వాణి. 'నీ వంటి దైవమును షడానన నే నెందుఁగానరా 2.11 అనడం త్యాగయ్య బాణి.

పెద్ద తెరువుండగాను పెడగంతలు దీసుక
పొద్దుపోక యడవులఁ బుంగుడయ్యేరు 9.94 అనడం

చక్కని రాజమార్గములుండగ
సందుల దూరనేల ఓమనసా 1.396 అనడం

అన్నమయ్య త్యాగయ్యల ఉపదేశాల వరుసలు.

"ఎంత సోదించి చూచినా ఎన్నెన్ని చదివినా
వింతలైన నీమూర్తి వెసఁదెలిసేమా" 8.28

అనే పల్లవిలోని ఎత్తుగడ

'ఎంత నేర్చిన ఎంత జూచినా
ఎంతవారలైన కాంత దాసులే' 1.292 అనే

త్యాగయ్య వాక్యంతో దీటుగా నిలుస్తుంది.

'సొమ్ముఁగలవాఁడు తనసొమ్ముఁజెడనిచ్చునా'

అనడం అన్నమయ్య సందేహమయితే

సమ్మతమున నామేను నీ
సొమ్మని వేసు కొన్నాను 1.113

అనడం తాగయ్య ప్రార్థన.

సంసారమే మేలు సకల జనులకును
కంసాంతకుని భక్తి కలిగితే మేలు 9.158

అనే వాక్యాభిప్రాయం

సంసారులైతె నేమయ్యా శిఖి పింఛావ
తంసు డెదుట నుండగ 2-206 తో

సరిపోతుంది.

దొరకునా యితని కృప తుది పదంబు 1.358
ఊరకే కల్గునా ఉన్నతోన్నత సుఖము 6.104

అనే అన్నమయ్య వాక్యాలలాగే త్యాగయ్య

దొరకునా ఇటువంటి సేవ 1.440
ఊరకే కల్గునా రామభక్తి 1.190

అనడం గుర్తించుకోదగ్గవి.

అన్నమయ్య త్యాగయ్యలిద్దరు జానపదగేయ ఫణితుల్ని ఆసరాగా గ్రహించి కీర్తనలెన్నో వ్రాశారు. వాటిలో లాలిపాటలు, జోల పాటలు, మేలుకొలుపులు, శోభనాలు, ఉయ్యాలపాటలు, పెండ్లి పాటలు, ధవళాలు, మంగళాలు, భజన కీర్తనలు ప్రధానమయినవి. కాకపోతే అన్నమయ్య తానొక్కడే పాడుతూ క్రమంగా తన పాటల్ని భజన పాటలుగా వ్యాప్తి పొందేట్టు చేశాడు. కాని త్యాగయ్య ఉంఛ వృత్తి చేబట్టడంతో బ్రతికున్న రోజుల్లోనే అపారమయిన శిష్య వర్గం అండదండలతో భజన సంప్రదాయానికే ప్రాధాన్యమిస్తూ కీర్తనలు పాడే విధానాన్ని శాశ్వతంచేయగలిగాడు.

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో బహుళ ప్రచారమంది నవి

గోవిందాశ్రిత గోకులబృందా 21.260
దేవ దేవం భజే దివ్య ప్రభావం 4.299

త్యాగయ్య సంస్కృత కీర్తనల్లో విస్తృత ప్రచారం పొందినవి

| | |
|---|---|
| రామం భజేహం సదా రాక్షసకుల భీమం | 2-125 |
| సామజవర గమన సాధు హృత్సార | |
| సాబ్జ పాల కాలాతీత విఖ్యాత | 2-226 |
| మానస సంచరరే! రామే | 3-146 |

అన్నమయ్య తనకాలం నాటి భాషకు ప్రాధాన్యమిచ్చి కృతులు సంతరించాడు. ఆ వాగ్గేయకారుని రచనల్లో శిష్ట భాషకు ఎంతటి గౌరవం వుందో పామరుల లేదా సమాజంలోని అట్టడుగు ప్రజానీకం భాషకు సమాన స్థానం కనిపిస్తుంది. త్యాగయ్య కృతుల్లోని భాష శిష్ట వ్యావహారిక భాష.

అన్నమయ్య కృతుల్లో సర్వత్రా కనిపించే ఊహాచిత్రాలు, వ్యంగ్య మర్యాదలు త్యాగయ్యలో సకృత్తుగా కనిపిస్తాయి. సంగీత సాహిత్యాలకు ప్రాధాన్యమివ్వడం అన్నమయ్య ధ్యేయం కావడం వల్లను సంగీతానికి అగ్రతాంబూలమివ్వడం త్యాగయ్య ఉద్దేశ్యం కావడంవల్లను ఈ తేడా కనిపిస్తుందని పండితులు భావిస్తారు. అంచేతనే రాళ్ళపల్లివారు కూడా త్యాగయ్య నాద విద్యా మర్మాల్ని గమనించినంత మెలకువతో శబ్ద రచనా రహస్యాల్ని గుర్తించలేదని అన్నారు. అయితే జాతీయాలు, నానుడులు, సామెతలు, భావవ్యక్తీకరణలోని నానా స్వరాలు ఇద్దరి రచనల్లోను లేకపోలేదు. అన్నమయ్యది సాహిత్య భాష—త్యాగయ్యది సంగీత భాష.

కృతుల నిర్మాణాల్లో కూడా ఇద్దరి రచనల్లోను తేడా వుంది. అన్నమయ్య రచనల్లో నియతం కనిపించే ప్రాస, అంత్య ప్రాసలు త్యాగయ్యలో అరుదుగా కనిపిస్తాయి. అలాగే ఫలానా భావానికి ఫలానా రాగం అనే నియమం అన్నమయ్య నియతంగా పాటించలేదు.

అన్నమయ్య కాలం నాటికి ఈ నియమం నియతంకాదు. కాని త్యాగయ్యలో భావానుకూలమయిన రాగ ప్రయోగం కనిపిస్తుంది. ఇవి సంగీతశాస్త్రం అభివృద్ధిని, లాక్షణిక మర్యాదల్ని పాటించడం వాగ్గేయకారుల సమ్మోదాన్ని తెలియజేస్తుంది.

పాడేము నేము పరమాత్మ నిన్నును వేడుక ముప్పది రెండు వేళల రాగాలను (9-178) అని నిశ్చయించుకొని సామవేదనాద వినోదుని (1-44) సామాదిగాన ప్రియ విహారుణ్ణి (1-46) సంతత గాన విలోలుణ్ణి (1-141) నాద బ్రహ్మరూపుణ్ణి (11-2-28) సామ సంగీత రాయుని (7.225) కీర్తించిన వాడు అన్నమయ్య.

అన్నమయ్య కంటె ఎక్కువగా సంగీత మాహాత్మ్యాన్ని సంకీర్తనల్లో విశదపరచినవాడు త్యాగయ్య.

శోభిల్లు సప్తస్వర సుందరుల భజింపవే మనసా 2-202

సంగీత జ్ఞానము భక్తివినా సన్మార్గముగలదే మనసా 2-203

శ్రీ ప్రప్రియ సంగీతోపాసన చేయవే 2-201

స్వర రాగ సుధా రసయుక్త భక్తి

స్వర్గాపవర్గమురా ఓ మనసా 2-217

సీతావర సంగీత జ్ఞానము ధాత వ్రాయవలెరా 2-236

అన్నమయ్య సంకీర్తనలపై హరిదాసుల దేవర నామాల ప్రభావమున్నట్లే త్యాగయ్య కీర్తనలపై తమిళ పాశురాల పురందర దాసాదుల ప్రభావం ఉంది.

రోజుకొక్క కీర్తన వేంకటేశ్వరాంకితం చేసిన ఘనుడు అన్నమయ్య. సత్యం తప్పక సాత్వికులకు భృత్యుడై దైవభేదం లేక నిత్యమైన సుస్వర గానంతో రాముణ్ణి నిరంతరం సేవించిన ధన్యుడు త్యాగయ్య

అన్నమయ్య అచ్చమయిన వాగ్గేయకారుడు. త్యాగయ్య ధాతుకల్పనాదక్షుడు. ఆంధ్ర వాగ్గేయకార ఆకాశంలో అన్నమయ్య త్యాగయ్యలు సూర్యచంద్రులు.

# అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు

## ఒక పరిశీలన

# అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు - ఒక పరిశీలన

దక్షిణ భారతదేశ వాగ్గేయకారుల్లో తాళ్లపాక అన్నమయ్యకు ప్రత్యేక స్థానం వుంది. స్తుత్యాత్మక, వైదుష్యాత్మక, సంగీతాత్మక, జానపదాత్మక సంకీర్తనలు వ్రాయడం, ఇతఃపూర్వం లేని ఎన్నో రాగాలలో కృతులు సాగించడం, వాసిలోను రాశిలోను ఇతరులకు సాధ్యం కానన్ని రచనలు చేయడం, సంగీత సాహిత్యాలను జోడు గుర్రాలుగా నడిపించడం, పదాలను శిష్ట సాహిత్యానికి దీటుగా రూపొందించడ మనేవి అన్నమయ్య సంకీర్తనల్లోని ప్రత్యేకలక్షణాలు.

అన్నమయ్యకు పూర్వం దక్షిణ భారతదేశంలో సంస్కృత సంకీర్తనలు చేపట్టినవారు లేరు. అయితే సంగీతానికి సంబంధించిన లక్షణ నిర్దేశం చేసినవారు మాత్రం కొందరు కనిపిస్తారు. వారిలో చాళుక్య సోమేశ్వరుడు (12వశ) సోమనార్యుడు (12వశ) జాయాప సేనాని (13వశ) శార్ఙ్గదేవుడు (13వశ) విద్యారణ్యుడు (14వశ) కుమారగిరి వసంతరాజు (14వ శతాబ్దం) లు ప్రసిద్ధులు. అయినా ఆ కాలం నాటి సంస్కృతసంకీర్తనల స్వరూపం ఇదమిత్థంగా

తెలియదు. తాళ్లపాక అన్నమయ్య కూడా లాక్షణికుడే. ఆతడు సంస్కృతంలో సంకీర్తనలక్షణం వ్రాశాడు. అయితే అది అలభ్యం. తాత వ్రాసిన సంస్కృత గ్రంథాన్నే మనుమడు తాళ్లపాక చిన్నన్న తెలుగులో అనువదించాడు.

అన్నమయ్య సంస్కృత సంకీర్తన లెందుకు వ్రాశాడన్నది పరిశీలించదగ్గ అంశం. లాక్షణికులలో రెండురకాల వారున్నారు. ఇతరుల రచనల్ని ప్రోగుచేసి లక్షణాలు చెప్పేవారు. ఈలాంటివారు స్వయంగా రచనలు చేయాల్సిన అవసరంలేదు. నిర్బంధమూ లేదు. ఇంకా తాము రచనలు చేస్తూ లక్షణాలు నిర్వచించేవారు రెండవ రకానికి చెందినవారు. అన్నమయ్య సంకీర్తన కారుడు కావడంవల్ల లక్షణాల్ని విశదంగా చెప్పే ప్రయత్నంతో సంస్కృతంలో సంకీర్తన లక్షణం వ్రాసి వుండవచ్చు.

సాధారణంగా సంగీతజ్ఞులయిన గాయకులకు సంస్కృత పరిజ్ఞానం అంతంత మాత్రమే. అది వారి తప్పుకాదు కూడా. అన్నమయ్యకు సంస్కృతంలో అపారమయిన పాండిత్యం వుంది. పైగా ఆదివన్ శఠగోపుల దగ్గర వేదవేదాంగాలు క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. ఏ వాగ్గేయకారుడున్నూ వుదాహరించని వేదపురాణేతిహాస కావ్యాల్లోని సంస్కృతవాక్యాలు అన్నమయ్య సంకీర్తనల్లో కనిపిస్తాయి. వీటిని శాస్త్ర ప్రమాణాలనవచ్చు.

మచ్చుకు కొన్ని-

దేవ మిము "నైతేన వినా తృణాగ్రమపి"
అని శ్రుతి వొగడెడిని 7.147

"త్వమేవ శరణంగతి" యనుటిది
నమ్మితి శ్రీ వెంకటనిలయా 7.147

"మమైవాంశం సర్వ భూతేషు'
అని గీతలలో నున్నది గాన 7-15

"నిర్గుణాయ గుణాత్మనే" యని
అనతి యిచ్చుటే ప్రమాణము 7.201

మును "నేమినా తప్తముద్రాం ధారయేత్త"ని
వెనువెంట శ్రుతియదె వెల్లివిరిసేని 7.257

అన్నమయ్య కాలంనాటికి ఆంధ్రదేశంలో జయదేవుని గీత గోవిందానికి విస్తృత ప్రచారముంది. గీత గోవిందంలోని రచనా సరళి అన్నమయ్యను ఆకర్షించి వుండవచ్చు. జయదేవాది వాగ్గేయ కారుల్ని అనుసరించాలనే కోరిక కూడా అన్నమయ్య సంస్కృత రచనలకు ప్రేరకం కావచ్చు. అన్నమయ్య తరువాత కాలంలో శివనారాయణ తీర్థులు, భక్తరామదాసు, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి, మార్గదర్శి శేషయ్యంగార్, ఉపనిషద్బ్రహ్మయోగి, త్యాగరాజు, శ్యామాశాస్త్రి, ముద్దుస్వామిదీక్షితర్, వాసుదేవాచార్యులు, శొంఠి సీతారామయ్య, జి. ఎన్ బాలసుబ్రహ్మణ్యం, హరినాగభూషణం ప్రభృతులు సంస్కృతంలో కూడా కీర్తనలు వ్రాశారు.

అన్నమయ్యది భక్తిమతం. ఆభక్తికి పండితులు పామరులనే భేదం లేదు. ఉన్నతులు నీచులనే వర్గ విభేదం కూడా లేదు. తెలుగు రచనలు చేస్తూ పామరుల్ని, సంస్కృత కృతులు చేబడుతూ పండితుల్ని మధ్యతరగతి ప్రజానీకాన్ని తనకేసి తిప్పుకొంటూ భక్తి సామ్రాజ్యంలో అందర్నీ భాగస్వాములు చేయడం అన్నమయ్య వుద్దేశ్యం కావచ్చు. ఈ పంథానే అన్నమయ్య తరువాతి వాగ్గేయకారులనుసరించారు కూడా.

సంస్కృతం వేదాంత బోధనకు, ప్రౌఢభావ ప్రస్ఫుటీకరణకు,

శిష్ట సాహిత్య సృష్టికి తగిందని, ఇతర భాషలకు ఆ శక్తి లేదని వాదించే వారు ఈకాలంలో మాత్రం కాదు ఆ కాలంలోను వుండేవుంటారు. ఆ అపప్రథ తొలగించడానికిన్నీ సంగీతానికి సంస్కృతం సరిదీటయిన భాష అనిన్నీ, సంస్కృతంలో వ్రాయబడ్డ కీర్తనలు సామాన్యులకు అర్థమవుతుందని నిరూపించడం అన్నమయ్య వుద్దేశ్యం కావచ్చు. అదీగాక అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు పరిశీలిస్తుంటే ఆనాడు సంస్కృతం నిత్యవ్యవహారంలో వుండేదేమో ననిపిస్తుంది.

తెలుగు సంకీర్తనల్లోలాగే సంస్కృత కీర్తనల్ని ఆధ్యాత్మ సంకీర్తనలని, శృంగార సంకీర్తనలని రెండురకాలుగా వర్గీకరించ వచ్చు. ఆధ్యాత్మ సంకీర్తనల్లో అవతార కీర్తనలు, తాత్త్విక కీర్తనలు, స్తుతి కీర్తనలనే విభాగాలు కనిపిస్తాయి. శృంగార సంకీర్తనల్లో ప్రధానంగా మధురభక్తి చోటు చేసుకొంది.

దుష్ట శిక్షణార్థం, శిష్ట రక్షణార్థం భగవంతుడు లోకంలో పుట్టడం అవతారప్రయోజనం. ఈ అవతారాలు అనేకం. అయినా మహావిష్ణువు అవతారాల్లో దశావతారాలకే ప్రసిద్ధి. ఈ పది అవతారాల క్రమంలో కొన్ని తేడాలుండవచ్చుగాని మూలార్థంలో విభేదం లేదు. జయదేవుని గీత గోవిందంలోని 'ప్రళయ పయోధిజలే' కీర్తనల్లో దశావతార వర్ణనలున్నట్టే అన్నమయ్యలోను ప్రత్యేక దశావతార కీర్తన వుంది కూడా

దశవిధా చరణం తన్నభవతి
దశ విధావస్థాం తే తత్ర 3.440

కీర్తనల్లో మత్స్య,కూర్మ,వరాహ,నారసింహ,వామన,పరశురామ,రామ, కృష్ణ,బుద్ధ,కల్క్యవతారాలు చెప్పబడ్డాయి. ఈ లాంటివే మరికొన్ని-

మహిత జనార్దన మత్స్య కూర్మ వరాహ
సహజ భార్గవ బుద్ధ జయతురగ కల్కి
విహిత జ్ఞాన శ్రీవేంకటేశ శుభకరం

మీన కూర్మవరాహ మృగపతి అవతారా
వామన రామరామ వరకృష్ణ అవతారా
దారుణబుద్ధ కలికి దశవిధ అవతారా 7.140

దశావతారాల వర్ణన తరువాత అన్నమయ్యలో విస్తృతంగా కనిపించేవి నారసింహ కీర్తనలు. సామాన్యుడయిన బాలుని కోసం స్వామి అవతార మెత్తడం ఇందులోని విశేషం. అదీగాక అన్నమయ్య ఈ అవతార కీర్తన చేయడానికి మరికొన్ని కారణాలున్నాయి. మొదటిది అహోబలంలో ఆదివన్ శఠగోపయతుల దగ్గర విద్యాభ్యాసం చేయడం, ఆ పరిసర ప్రాంతాలతో పరిచయం వుండడం. రెండవది అహోబల నరసింహుడే అన్నమయ్యకు గురువై త్రిదండం, చక్రాది మంత్రాలు ప్రసాదించడం. ఈ విషయాన్నే చిన్నన్న

పరమేశుడగు నహోబల నృసింహుండు
గురుభావమున ఁజేరుకొని త్రిదండంబు
నా నరసింహ చక్రాది మంత్రములు
తానె ప్రత్యక్షంబు ఁదయసేయఁగొనుచు

అని "అన్నమాచార్య జీవితము" లో స్పష్టం చేశాడు. అంతేగాకుండా అన్నమయ్య నరసింహమంత్రోపాసకుడు కావడంవల్లను, ఆ మంత్రానికి సార్థకం కల్గించేట్టు ముప్పయి రెండువేల కీర్తనలు వ్రాయడం కూడా కారణమని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు భావించారు.

అన్నమయ్య నరసింహులలో 'గరుడాచల నరసింహుడు' ప్రసిద్ధుడు. గరుడాచలం, వేదాచలమనే రెండు కొండల మధ్య వుండే అచలచ్ఛాయ మేరువనే కొండ మధ్యలో జ్వాలా రూపిగా ప్రకాశించే స్వామిని అన్నమయ్య వేనోళ్ల కొనియాడాడు.

ఆనన వహ్నిలయాంతక సింహం
తిలకిత బహు దీపిత సింహం
సలలిత గరుడాచల సింహం 2.166

పరిపూర్ణ గరుడాద్రి పంచాననమ్
కర్బూరదంష్ట్రాగ్ని కణ ఘోరపంచాననమ్ 5.253

ఇంక అన్నమయ్య అభినివేశంతో వర్ణించిన మూర్తి "ప్రహ్లాద వరదుడు" ఎగువ అహోబలంలో శ్రీ నరసింహస్వామికి ఉగ్రస్తంభానికి మధ్యన ప్రహ్లాదవరదుడున్నాడట. కాని అన్నమయ్య తిరుమలను అహోబలాన్ని అభేదంగా వర్ణించడం వల్ల ఏ ప్రహ్లాదవరదుడో నిరూపించడానికి వీలులేదు.

అహోబలేశ ప్రహ్లాదవరద
సహజ శ్రీ వేంకటాచలనివాస 24.300

ఆనందనిలయ ప్రహ్లాదవరద
లలిత శ్రీవెంకటాద్రి ప్రహ్లాదవరద 9.213

జయ జయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాద వరద
శ్రీ వేంకటగిరి శిఖర నివాస 7.55

అన్నమయ్య ఈ ప్రహ్లాదవరదుణ్ణి తెలుగు సంకీర్తనల్లోను అభినివేశంతో వర్ణించడం చూడవచ్చు.

కొలువు తానల్లవాఁడె కూచున్నాడు గద్దెమీద
బలవంతుఁడితఁడు ప్రహ్లాద వరదుఁడు 10.163

సుముఖా యెచ్చరిక వో సర్వేశ్వరా
అమరె నీ కొలువు ప్రహ్లాదవరదా 11.1.194

వాఁడెవో ప్రహ్లాద వరదుఁడు
వాఁడెవో భక్త వత్సలుఁడు 7.121

ఇక అన్నమయ్యలో విస్తృతంగా కనిపించే మూర్తి "సుగ్రీవ నరసింహుడు". ఈ మూర్తి సుగ్రీవ ప్రతిష్ఠ నరసింహుడు కావచ్చని శ్రీ రాళ్లపల్లి వారి అభిప్రాయం.

నమో నమో లక్ష్మీనరసింహా
నమో నమో సుగ్రీవ నరసింహా 7.114

వరద సులభ భక్తవత్సల నరసింహా
నరమృగవేష శ్రీ నరసింహా
పరమ పురుష సర్వ పరిపూర్ణ నరసింహా
గిరిగుహావాస సుగ్రీవ నరసింహా 7.114

సంస్కృతంలో కనిపించినట్లే తెలుగు సంకీర్తనల్లోను సుగ్రీవ నరసింహుడున్నాడు.

అవధారు సకల లోకైకనాథ
సువర్ణరూపమైన సుగ్రీవ నారసింహా 9.215

సుగ్రీవ నారసింహునిఁ జూడరో వాఁడె
అగ్రపూజ గొన్నవాడు ఆదిసింహ 10.146

సేవించరో జనులాల చిత్తజగురుఁడితఁడు

కేవల దయానిధి సు(గీవ నారసింహుఁడు 10.157

బలవంతుఁడితని బంట్లమై (బతుకుదుము
కిల కిల నవ్వీ సు(గీవ నరసింహుడు 24.302

సులభుఁడై వున్నాఁడు సు(గీవ నరసింహుడు 11.1.217

జగన్నాథుఁడు వీడే సర్వరక్షకుఁడు వీఁడే
నిగమ వేద్యుఁడైన నిత్యుఁడు వీఁడే
సగుణవంతుఁడు వీఁడె సర్వసముఁడు వీఁడే
నగుమొగము సు(గీవ నరసింహుఁడు వీడే 11.1.205

తెలుగు నారసింహ సంకీర్తనల్లో శ్రీరమానరసింహుల విహారాలు, నరసాలు, సయ్యాటలు విస్తృతంగా కనిపిస్తాయి. కాని సంస్కృత సంకీర్తనల్లో ఈలాంటి వర్ణనలెక్కడా కనిపించవు.

సంఖ్యాదృష్ట్యా నరసింహ కీర్తనల తరువాత శ్రీరామ సంకీర్తనలు అన్నమయ్యలో ఎక్కువ. అన్నమయ్య ద్విపద రామాయణ కర్త కూడా. ఇది ప్రవిమల ద్విపద ప్రబంధమట. అయితే ఇది అలభ్యం. తెలుగు సంకీర్తనల్లోను రామాయణ కీర్తనలు సుమారు రెండువందలకు పైగా కనిపిస్తున్నాయి. అన్నమయ్య సంస్కృత శ్రీరామ సంకీర్తనల్లో రెండు పద్ధతులున్నాయి మొదటి పద్ధతిలో రామాయణ సంఘటనలు వరుసగా చెప్పడం. ఉదాహరణకు-

దశరథ తనూజాయ తాటకదమనాయ
కౌశిక సంభవ యజ్ఞ గోపనాయ
పశుపతి మహాధనుర్భంజనాయ నమో
విశద భార్గవరామ విజయ కరుణాయ

భరిత ధర్మాయ శూర్పణఖాంగ హరణాయ
ఖరదూషణాది రిపు ఖండనాయ
తరణి సంభవ సైన్య రక్షకాయ నమో
నిరుపమ మహావారినిధి బంధనాయ

హతరావణాయ సంయమినాథ వరదాయ
అతులి తాయోధ్యా పురాధిపాయ
హితకర శ్రీ వేంకటేశ్వరాయ నమో
వితత వావిలి పాటి వీరరామాయ 7.39

ఇంక రెండవపద్ధతిలో సన్నివేశ క్రమరాహిత్యం కనిపిస్తుంది. స్తుతి రూపకమైన వాటిల్లో ఇదొక నెరసు కానేకాదు. ఉదా-

వారిధి బంధన రావణ శిరశ్ఛేదక
మారీచ సుబాహు బలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజ సంహారక
హర చాపహర అహల్యా శాప విమోచక 10.170

శరధి బంధనరామ సవనరక్షక రామ 10.156

అనిలజవరద అహల్యా శాపవిమోచన 11.196

ఇక దివ్యదేశాలదృష్ట్యా పరిశీలిస్తే అన్నమయ్య విజనగర (11.176) వావిలిపాటి (7.39) వాయల్పాడు–చిత్తూరు జిల్లాలోని శ్రీరాముల్ని కీర్తించినట్టు చెప్పవచ్చు.

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో జగన్నాథుని ప్రసక్తివుంది. సామాన్యార్థంలో తీసుకొంటే ఇందులో విశేషంలేదు. కాని ఈ మాట పూరి జగన్నాథుని గుర్తుకు తెస్తుంది. అన్నమయ్య బహుశః ఈ క్షేత్రాన్ని దర్శించి వుండవచ్చు. "ఒడ్డె మాటలాడి ఒడ్డె వాడనయితి"

అనే వాక్యం పై అభిప్రాయానికి బలమిస్తుంది అదిగాక పూరీ జగ
న్నాథంలో బలభద్రాదులకు ప్రత్యేక పూజాదులున్నాయి.

త్వమేవ శరణం త్వమేవ శరణం
కమలోదర శ్రీ జగన్నాథా

బల భద్రానుజ పరమపురుష దుగ్ధ
జలధి విహార కుంజర వరద
సులభ సుభద్రా సుముఖ సురేశ్వర
కలి దోషహరణ జగన్నాథా 11.3.111

పదమూడవ శతాబ్దంలో వెలసిన వాగ్గేయకారుడు లీలాశుకుడు. అతని కృతి కృష్ణకర్ణామృతం. గోపికలతో పాటు తన్ను నాయికగా భావించుకొంటూ కృష్ణ కిశోరమూర్తి దివ్యమంగళ విగ్రహాన్ని కోటి భంగుల్లో దర్శించి అలౌకికమయిన ఆధ్యాత్మికానందం పొందడం ఈ కర్ణామృతంలోని విశేషం. అన్నమయ్యలో కూడా కృష్ణ కిశోర మూర్తి వర్ణనలున్నాయి. అందులో ప్రసిద్ధమయింది.

భావయామి గోపాలబాలం మన
స్సేవితం తత్పదం చింతయేయం సదా

కటిఘటిత మేఖలా ఖచితమణి ఘంటికా
పటల నినదేన విభ్రాజమానం
కుటిలపద ఘటిత సంకుల శింజితే నతం
చటుల నటనా సముజ్జ్వల విలాసమ్

నిరతకర కీలిత నవనీతం బ్రహ్మాది
సురనికర భావనా శోభిత పదమ్
తిరువేంకటాచల స్థిత మనుపమం హరిం
పరమ పురుషం గోపాల బాలమ్ 5.79

నంద నందన వేణునాదవినోద (11.3.100) నవనీతచోర (8.24) కీర్తనల్లోను బాల (కిశోర) కృష్ణమూర్తి వర్ణనలున్నాయి.

అన్నమయ్య సంకీర్తనల్లో రాధా మాధవ సంకీర్తనలు పేర్కొన దగ్గవి. భారత, భాగవత, హరివంశాదుల్లో రాధ లేదు. బ్రహ్మ వైవర్త పురాణం బ్రహ్మఖండం 45వ అధ్యాయంలో రాధ ప్రసక్తివుంది.

గోలోకంలో బృందావనముంది. శతశృంగమనేచోట మల్లికా వనంలో జగన్నాథుడు రత్నసింహాసనంలో కూర్చొని వున్నాడు. అపుడతనికి క్రీడాభిలాష కలిగింది. ఆ మల్లికావనంలో ఎవరేది అను కొంటే అలా జరుగుతుంది. అందువల్ల ఆ స్వామి రెండు రూపాల వాడయ్యాడు. కుడిదేహం కృష్ణుడయితే ఎడమ భాగం రాధ అయింది.

ఈ పురాణంలోనే "రాధ" కు సంబంధించిన మరికొన్ని కథలు చెప్పబడ్డాయి.

కృష్ణుడు గోలోకంలో మహారణ్యంలో నిర్జన స్థలంలో రాధతో విహరించాడు. రాధ సుఖాల్లో తేలియాడుతూ తన్ను తాను మరచింది. అపుడు కృష్ణుడు రాధతో చెప్పకుండానే గోలోకం వదలి బృందారణ్యంలో విరజతో శృంగార విహారం మొదలెట్టాడు. చెలి కత్తెలు శ్రీకృష్ణుని విహారాన్ని రాధతో చెప్పారు. రాధ ప్రాణనాథున్ని అనరాని మాటలంది. అపుడు సుదామునికి కోపం వచ్చింది. "సామాన్య మానవస్త్రీలాగా కోప్పడ్డం న్యాయంకాదు భూలోకంలో పుట్ట" మని శపించాడు. రాయణుడనే శ్రీహరి అంశరూపున్ని పొంది గోకులంలోనే బృందావనంలో విహరిస్తావని శాపవిమోచనం కూడా ప్రసాదించాడు. ఆ మేరకు వృషభానుని ఇంట్లో రాధ జన్మించింది. బ్రహ్మదేవుడు రాధా కృష్ణులకు వివాహం జరిపించాడు.

దేవీ భాగవతంలో శివ పార్వతులే రాధాకృష్ణులుగా జన్మించి నట్లు చెప్పబడింది.

గాథా సప్తశతిలో రాధ అంటే గోపికలకున్న అసహనం వర్ణించ బడింది.

ఈ రాధామాధవ ప్రణయం గీతగోవిందంలో పరిపుష్టమయింది. అందులోని రాధ పరకీయ. గోపికల్లో ఒకతె. అయితే ఇతర గోపికల కంటె కృష్ణుని అభిమానం పొందడం విశేషం. శ్రీకృష్ణుడు గోపికలతో విహరించడం గుర్తించి రాధ పరితపించింది. దూతికను శ్రీకృష్ణుని దగ్గరికి పంపింది. అపుడు కృష్ణునికి రాధ చప్పున గుర్తుకు వచ్చింది. వెంటనే విరహంలో పడ్డాడు. రాధావిరహాన్ని దూతికలు చెప్పారు. వెంటనే రాధను తోడ్కొని రావలసిందిగా ఆదేశించాడు. దూతిక రాధను వెంటబెట్టుకొని వచ్చింది. మార్గాయాసంవల్ల ఒక పొదరింట్లో రాధ కూర్చున్నది. దూతిక కృష్ణుణి అక్కడికే తీసుకొనివచ్చింది. రాధ అలుక తీర్చి కృష్ణుడు మురిపించి మరపించాడు.

తెలుగు కవులలో శ్రీనాథుడు భీమఖండంలో రాధను వర్ణించాడు.

వాలిక మోము మత్తవన
బర్హి కిశోర లాస్య లీలపై
వాలిచి పచ్చకప్పురపు
వాసనతోడి ముఖారవింద తాం
బూలపు మోవి మోవిపయి
మోపుచు రాధకు నిచ్చు ధూర్తగో
పాలుడు బ్రోచుగావుత న
పారకృపామతి మంత్రి యన్ననిన్ 1.3

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో రాధ పూర్వజన్మ వృత్తాంతం కనిపించదు.

అతి శోభితేయం రాధా
సతత విలాసవశా రాధా

దర్పక బలబోధా రాధా
తర్పణ గంధవిధా రాధా
దర్పయుత క్రోధా రాధా
దర్మకరసవేధా రాధా

తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
ధారి తామ రోధా రాధా
దారి తాప రాధా రాధా

తరుణీ మరు గాధా రాధా
ధర సమకుచ బాధా రాధా
తరణ సదను బోధా రాధా
ధరణీ దుస్సాధా రాధా

తను భవగురు గాథా రాధా
స్తనకృత గిరిరోధా రాధా
తమ వర వచన సుధ రాధా
ధ్వని జిత పిక మేధా రాధా

తరుణ సఖీసవిధా రాధా
దరశశిరుచి సౌధా రాధా

తరళిత తటి ద్విధా రాధా
దరహాసనవరోధా రాధా

ధవగర్వ నిషేధా రాధా
స్తవతత్పర విబుధా రాధా
ద్రవధునీ కృత సుధా రాధా
దవమదన వ్యథా రాధా

తరుణత్వపురోధా రాధా
తరుణస్మరయోధా రాధా
తరుపళుమణి గుణధారక బహుల వి
తరణపరా బహుధా రాధా

దైవిక ఖోసువధా రాధా
ధ్రావక నిజాభిధా రాధా
శ్రీ వేంకటగిరి దేవకృపా పు
ద్రా వైభవ నాథా రాధా 4.48

ఈ సంకీర్తనల్లో కృష్ణలాలితయైన రాధ వర్ణన, లాలింపబడిన తీరు వర్ణింపబడింది. మరొక్క కీర్తనలో కూడ రాధ ప్రసక్తివుంది.

రాధా మాధవ రతి చకితమితి
బోధావహం శ్రుతి భూషణం 3.664

అవతారాల కీర్తనల తర్వాత చెప్పుకోతగ్గవి స్తుతి కీర్తనలు, వీటిలో వర్ణనలకు అవకాశంలేదు. సాభిప్రాయ పదజాలానికే ప్రాముఖ్యమివ్వబడుతుంది. ఇవి యించు మించు స్తోత్రాల రూపంలో వుంటాయి

జలధి బంధన జలధి శయన
జలనిధి మధ్య జంతుకల
జలధి జామాత జలధి గంభీర
హలధర నమో హరినమో 7.157

ముకుంద కేశవ మురహర
సకలాధిప పరమేశ్వర దేవేశ
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకట విభవ నమో పరమాత్మన్ 11.66

వామన గోవింద వాసుదేవ ప్రద్యుమ్నా
రామ రామ కృష్ణ నారాయణాచ్యుత
దామోదరానిరుద్ధ దైవ పుండరీకాక్ష
నామత్రయోధీశ నమో నమో 8.28

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో తాత్త్విక బోధకాలు చాల తక్కువ.

"ఏవం శ్రుతిమత మిదమేవ" (2-4) సంకీర్తనల్లో జనులార! వినండి. ఇదిగో నేనిపుడు ప్రకటించేది వేదమతం. ఆలోచించి నిర్ణయించడానికి ఇంతకంటె శ్రేష్ఠమయిన మతం మరొక్కటిలేదు. మాటిమాటికి పుట్టడమున్నా. ఆ కారణంగా జీవుడనుభవించే సుఖాను భావాలలో కొట్టుమిట్టాడే వారికి మేలయిన ఐశ్వర్యసుఖమిదే. ఎల్ల వేళలా శ్రీమన్నారాయణుని గుణకర్మనామాల సంకీర్తనమే ఆ సుఖం. అంతకంటె మించింది మరొకటి లేదు. చీటికి మాటికి చావుకు గురి గావడమనే పరాభవంతో నిండిన హృదయం కలవారికి ఐహికాముష్మికాలతో ఉత్తమగతికి సాధనమయింది ఇదొక్కటే. అదే శేషశాయి యైన నారాయణుని రమ్యసేవ. ఇంతకంటె మించిన వినోదం మరొ

క్కటిలేదు. సంసార కాలుష్యమనే రోగానికి చిక్కి చీకాకయిన వారికి హింసావిహీన మార్గమొక్కటే. కంసాంతకుని మహిమల్ని ప్రశంసించడమే ఆ మార్గం.

భగవంతుణ్ణి షట్ఛాస్త్రవిదులు ఏయే రూపాల్లో ఏయే విధంగా భావిస్తారో "బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి" సంకీర్తనల్లో అన్నమయ్య స్పష్టంచేశాడు. భక్తులు సులభుడని, సాంఖ్యులు పురుషుడని, పద వాక్యజ్ఞులు పదవాచ్యుడని, వేదాంతులు బ్రహ్మలసత్వదమని, మీమాం సకులు విపుల కర్మల విభవస్వరూపుడని,గుణస్వరూపుడని కొందరు, నిర్గుణుడని మరి కొందరు భావిస్తారని సకలవేదవేదాంగ సారాన్ని స్పష్టం చేశాడు అన్నమయ్య.

ఈ అభిప్రాయాన్నే అన్నమయ్య తెలుగు సంకీర్తనల్లో కూడా విశదీకరించాడు.

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యున్నట్లు

కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మం బనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆదిభైరవుఁడనుచు

సరినెన్నుదురు శాక్తేయులు శక్తిరూపు నీవనుచు
దరిశనములు మిము నానావిధులను తలపుల కొలదుం భజింతురు
సిరుల మిమ్మునే యల్పబుద్ధిఁ దలచిన వారికి నల్పం బవుదువు
గరిమల మిమునే ఘనమని తలఁచిన ఘనబుద్ధులకు ఘనుఁడవు

నీ వలనఁ గొఱతే లేదు మరి నీరు కొలది తామెరవు
ఆవల భాగీరథి దరి బావుల ఆ జలమే వూరిన యట్లు
శ్రీ వేంకటపతి నీవైతే మము (జేకొని వున్న దైవమని
యీవల నే నీ శరణనియెదను యిదియే పర తత్త్వము నాకు 7.159

ఇంక అన్నమయ్య శృంగార సంకీర్తనల్ని పరిశీలిద్దాం.శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః. మధురమూ, అనందజనకము అయిన శృంగారం ఆలంబనాది భేదం బట్టి లౌకికం అలౌకికమని రెండురకాలు. కాంతా విషయికమయితే లౌకికం. భగవద్విషయిక మయితే దివ్యం. ఈ ప్రవృత్తికి ఆలంబనం భగవంతుడు. అతని దివ్యచరితలే విభావాలు. భగవదాకార చిత్తవృత్తి స్థాయి. అవే భగవ ద్రతి. జీవాత్మపరమాత్మలను ఆలంబనంగా స్వీకరించి నాయికా నాయకుల పరస్పర శృంగార విలసన రూపంలో ఇదే దివ్య శృంగా రంగా రూపొందుతుంది. అంచేతనే అన్నమయ్య రచనల్లో స్వీయా పరకీయలే కనిపిస్తారు. తిరువేంకటనాథుడు నాయకుడు. నాయిక అలమేల్మంగ కావచ్చు. రాధ గూడ కావచ్చు. లేదా సామాన్య గోపిక కూడ కావచ్చు. కవి తన్నే నాయికగా భావిస్తాడు ఇదే మధురభక్తి. ఈలాంటిది ఇతరమతాల్లోను వుంది.

"The imagery of man woman love was employed by christian mistics too. st. Bernards Sermons and the writings of coventry Patmore speak of the church as the bride and of christ as the bridegroom. In our country this kind of devotional mood is already found prominently in the Rigvedic prayers and hymns. This was developed as Madhurarasa. Not only in the Krishna the devotional mood can be seen in Kashmir Saivisam.'' అని అన్నారు ఆచార్య రాఘవన్ గారు.

ఈ మధురభక్తినే చిన్నన్న "కృతులై వేంకటశైల వల్లభరతి క్రీడా రహస్యంబులు"గా పేర్కొన్నాడు. అన్నమయ్య సంస్కృత శృంగార సంకీర్తనల్లో సంభోగశృంగార వర్ణన విపులంగా కనిపిస్తుంది.

అహో సురతవిహారోయం
సహజ పరాజయ శంకా నాస్తి

సురతాంత శ్రమ సుఖం కిం వా
పరలజ్జా సావా కావా
పరవశతను వైభవం కింవా
నిరతాం తయో నికృతిం నాస్తి 12.78

అనడంలోని సంభోగ శృంగార అనుభూతుల్ని గమనించవచ్చు. ఈలాంటివే మరికొన్ని—

దంత చ్ఛదముద్రా మదనాస్త్రల
తాంత శాంతి కృతిరహో భవతి 12.318

ఇక విప్రలంభంలో ఈర్ష్యావిప్రలంభం అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో ఎక్కువ. నాయిక నాయకుని దెప్పి పొడవడం ఇందు లోని ప్రధానవిషయం.

"జానామ్యహం తే సరస లీలాం
నానావిధ కపట నాటక సఖత్వం" 3.83

"ప్రలపన వచనైః ఫలమిహ కిం
చల చల కుడ్య క్షాళనయా కిం" 12-39

ఇంక అన్నమయ్య సంకీర్తనల్ని నిర్మాణ దృష్టితో పరిశీలిద్దాం. భక్తి ప్రధానములయిన పాటలు సంకీర్తనలు. సంగీతరచనా ప్రధాన

ములయిన పాటలు కృతులు. తాళ్లపాక కవులు వచనాలు వ్రాసినా సంకీర్తనలనే పేర్కొన్నారు. వీటినే చిన్నన్న "పదము" లన్నాడు. అవాఙ్మానస గోచరమయిన దివ్యశక్తిని కీర్తించి పాడేది కీర్తన. గేయ మానమయిన కీర్తనమే భక్తుని హృదయాన్ని పరమాత్ముని పాద సన్నిధికి తీసుకొని వెళుతుంది. ఇలాంటి పదాలు లక్షణ భేదం బట్టి మూడురకాలు. వృత్తపదాలు, నిబంధపదాలు, అనిబంధపదాలు. సంస్కృత ఛందస్సులో ప్రసిద్ధమయిన 26 ఛందః ప్రక్రియలనుండి రూపొందింపబడేవి పదాలు. ఈ పదాలే విషమం, సమం, అర్ధసమ మని మూడు విధాలు.

తాళ్లపాకవారి రచనల్లో "నిబంధపదాలే" ఎక్కువ. వృత్తపదాల్లోని నియమాల్ని ఈ నిబంధ పదాలకు కూడ అనువర్తింప జేయ వచ్చు.

## సమపదం:

గోవిందాశ్రిత గోకుల బృందా
పావన జయ జయ పరమానందా

జగదభిరామా సహస్రనామా
సుగుణధామా సంస్తుతనామా
గగన శ్యామా ఘనరిపు భీమా
అగణిత రఘువంశాంబుధి సోమా 2.268

చరణంలోని నాలుగు పాదాలున్ను ఒక్క చాలున సాగడం సమం.

## విషమం:

పదంలోని చరణాలలోని నాలుగు పాదాలున్ను నాలుగు విధాలుగా ఉండడం విషమం.

పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ
ధాత్రీశ కామితార్థ ప్రదాయ
గోత్ర భిన్మణి రుచిర గాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రి నిలయాయ తేనమో 5.172

## అర్ధసమం:

చరణంలోని విషమపాదాలొక రీతిగాను సమపాదాలు మరొక రీతిలోను వుండడం అర్ధసమం.

వాసుదేవ కృష్ణ వామన నరసింహ
శ్రీ సతీశ సరసిజ నేత్రా
భూసురవల్లభ పురుషోత్తమ పీత
కౌశేయ వసన జగన్నాథా 11.3.111

నిబంధపదాలకు యతి - ప్రాస - మాత్రా గణాలు-మార్గదేశి తాళాలు - ముద్ర అనే ఐదంగాలున్నాయి. యతి ప్రాసలపట్ల తెలుగు నియమాల్నే అన్నమయ్య సంస్కృత పదాలకు పట్టించాడు. సంస్కృతంలో ఏ పాదానికి ఆ పాదం విడిగా వుంటుంది. ఒక పాదం మరొక పాదంతో ముడివడదు. అయితే తెలుగులో ఈ నియమం లేదు. ఒక పాదంలోని చివరి అక్షరాలు రెండవ పాదంలో దూసుకొని పోవచ్చు లేదా కలుసుకోవచ్చు.

గదాధరం మేరుగంభీర ని
నదం పరమోన్నత శుభదమ్ 5.107

తరణి తను గంధ విలేపన వి
స్తర సౌభాగ్యం సఫల మిదమ్ 3.384

మోహినా మత్యంత ముష్కరాణాం గుణ
గ్రాహినాం ఘనవైక కఠినా నామ్ 2.342

ఇక రెండవది యతి నియమం. సంస్కృతంలో విచ్ఛేద రూపకమయిన యతి వుంది. అక్షరమైత్రికి సంబంధించిన యతి లేదు. తెలుగులో విచ్ఛేదయతి నియతం కాదు. సారూప్యయతి మాత్రం చాలు. అన్నమయ్య సంస్కృత కీర్తనల్లో తెలుగు యతినియమాల్నే పాటించాడు.

| | |
|---|---|
| దురిత మిదమేవ జం_తూనాం సర్వత్ర | 2.310 |
| హరిమచ్యుతం ఘన వి_హంగ వాహం | 2.444 |
| దశితదైతేయ కో_దండ దీక్షా దక్షం | 11.199 |
| ధారాయిష్యామి సుం_దరమితి వ్యాజేన | 3.440 |
| మనసిజ జనక ర_మా రమణ | 2.358 |
| లలిత భవ దీక్షా వి_లాస మనసిజ బాణ | 4.160 |

ఇంక అప్పకవి యతిభేదాల దృష్టితో పరిశీలిస్తే అన్నమయ్య సంస్కృత కీర్తనల్లో స్వరప్రధానవళి, వర్గజయతి, సరసయతులు విరివిగా కనిపిస్తాయి.

| | |
|---|---|
| అభినవ కల్యా_ణాంచిత రూప | 3.664 |
| ఆనన వహ్ని_లయాంతక సింహం | 2.664 |
| ఉరగ శయనం మ_హోజ్జ్వలంతం | 4.327 |
| ఆజాను బాహుం నీ_ లాభ్రకాయం | 4.299 |

కచటతప వర్గాలలోని చివరి అనునాసికాక్షరాలను వదలి మిగిలిన నాలుగు అక్షరాలు పరస్పరం మిత్రత్వం పొందడం వర్గజయతి. టవర్గాక్షరాల యతి మైత్రి తప్ప తక్కినవి అన్నమయ్యలో

కనిపిస్తాయి.

| | |
|---|---|
| కనకాంబర నిజ — ఘన చరణాంబర | 22.419 |
| కులిశనఖరముఖ — ఘోషిత సింహం | 5.53 |
| ఖగరాజవాహనం — కమల నయనం | 5.53 |
| కింవా కురు మయ — ఖేలన మిహకిం | 4.24 |
| తిరు వేంకటగిరి — దేవనిదానం | 4.46 |
| దశవిధావతార — ధర్మరక్షకమూర్తి | 7.167 |
| పరమామృత రస — భాగ్యమిదం | 4.46 |

అయహలు, చఛజఝ శషసలు, నణలు పరస్పరం మిత్రత్వం పొందడం సరసయతి.

| | |
|---|---|
| అయమేవ సతతం శ్రీ — యః పతి దేవేషు | 11.17 |
| సంతత కరుణా — జయసింహం | 2.166 |
| శంకాం వినా కిం — సమాగతోసి | 2.358 |
| చతురలాంఛనం — సఫల మిదం | 3.384 |
| న భజతుషాం కరు — ణానిధే భవ | 4.85 |
| సమధికం తవ — శౌర్యవిచారం | 4.461 |

ఇవేగాక తెలుగుకే సహజమయిన ప్రాసయతులు కూడా సంస్కృత కీర్తనల్లో కనిపిస్తాయి.

ఇందిరానాధ మర విందనాభం

నిత్యాయ విబుధ సంస్తుత్యాయ నిత్యాది 5-172

అక్షరాయాతి నిరపేక్షాయ 5.172

మొదటి పాదం కడపటి అక్షరం నాల్గుపాదాల కడపట సమానంగా చెప్పడం అంత్య ప్రాస లక్షణం.

చరణముల కడ (గూర్చు ప్రాసములకెల్ల
నన్నియు సమస్వరంబులై యమరవలయు'' 3.2.89

అని అప్పకవి నిర్వచనం. సర్వవ్యంజన సామ్యం అంత్య ప్రాసకు తప్పని సరిగా వుండవలసిన నియమం. ఈ ప్రాసలు పాదఖండాంత రాలలోను వుండవచ్చును. ఉదాహరణకు

పరమపురుషాయ నిజ భక్త జనసులభాయ
దురితదూరాయ సింధురహితాయ 5.306

జగదభిరామా సహస్రనామా
సుగుణధామ సంస్తుతనామా 21.260

పాదాంతంలో ఆవృత్తి అయ్యే అంత్య ప్రాసలను అక్షరాలబట్టి ఏకాక్షర, ద్వ్యక్షర, త్ర్యక్షర, చతురక్షర, పంచాక్షర, షడక్షర ప్రాసలని వర్గీకరించవచ్చు. మచ్చుకు కొన్ని ఉదాహరణాలు

ఏకాక్షరం.

సీతా వనితా సమేతం
స్ఫీత వానరబల వ్రాతం
పూత కౌసల్యా సంజాతం
పీత భీత మౌని విద్యోతం 11.157

ద్వ్యక్షర అంత్యప్రాస.

దానవదైత్య విదారణ సింహం
నానాయుధకర నరసింహం

ఘనభోంతరాపూరిత సింహం
ఆనన వహ్నిలయాంతక సింహం 2.160

ఇదే మోస్తరు "అతిశోభితేయం రాధా" సంకీర్తనల్లో రాధా (4.48) "నమోనమో దశరథ నందన రామ" సంకీర్తనల్లో రామ (10.144) అనే ద్వ్యక్షర పదాలు అంత్యప్రాసలుగా కనిపిస్తాయి.

త్ర్యక్షర అంత్యప్రాస.

కేకి పించావతంస కేశవ
శ్రీకర గుణాభిరామ చెన్నకేశవ
కేకి వాహన వరద కేశవ
పాక శాసనవంద్య భళిభళి కేశవ

చతురాక్షర అంత్యప్రాస.

నమోనమో లక్ష్మీనరసింహా
నమోనమో సుగ్రీవనరసింహా 7.114

షడక్షర అంత్యప్రాస.

ఆనందనిలయ ప్రహ్లాదవరదా

అన్ని పాదాంతంలో అంత్య ప్రాసలు పాటించడమే గాకుండా 1,2 పాదాల్లో, 3-4 పాదాల్లో, 1,3 పాదాల్లో, 2,4 పాదాల్లో, 2-3 పాదాల్లో, 1-2, 3 పాదాల్లో, 1-2-4 పాదాల్లో ఈ అంత్యప్రాస అనేక విధాలుగా కనిపిస్తుంది.

1,2 పాదాల్లో

పరమపురుషాయ నిజభక్త జనసులభాయ
దురితదూరాయ సింధుర హితాయ
నరకాంతకాయ శ్రీ నారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో 5.308

2-4 పాదాల్లో

ధరణీసతి ఘనస్తన శైలపరిరంభ
పరిమళ శ్రమజల ప్రమదాయ
సరసిజ నివాసినీ సరస ప్రణామయుత
చరణాయ తే నమో సకలాత్మకాయ 5.148

2-3 పాదాల్లో

నందకధరం జనార్దనం గో
విందం చారు ముకుందం
నందగోపవర నందన కందం
యిందురవినయన మీడే 5.107

1, 2, 3 పాదాల్లో

కిరణార్కకోటి తేజ కేశవా
హరిలక్ష్మినాయక యాదికేశవా
గిరిరాజసుతానుత కేశవ నమో
శరధి గంభీరశాయి జయ జయ కేశవా 1.148

1, 2, 4 పాదాల్లో

ఫరిత ధర్మాయ శూర్పణఖాంగ హరణాయ
ఖరదూషణాది రిపుఖండనాయ
తరణి సంభవసైన్య దక్షకాయ నమో
నిరుపమ మహావారివిధి బంధనాయ 7.39

1, 2; 3, 4 పాదాల్లో భిన్నరీతుల్లో అంత్యప్రాస

వారిధి శయన వామన శ్రీధర
నారసింహ కృష్ణ నమోనమో
నీరజనాభ నిగమ గోచర
నారాయణ హరి నమోనమో 11.5

2, 3, 4 పాదాల్లో ఏకాక్షర అంత్యప్రాస

దయా నివృత తనుధారీ సం
శయాతిశయ సంచారీ
కయాప్యజిత వికారీ
క్రియా ముఖ కృపాణధారీ 4.45

చరణాంతాల్లో వచ్చే పదాలను కూడా వ్యాకరణ దృష్టితో ఐదు రకాలుగా విభజించవచ్చును.

సంబోధనాంతాలు:

బహుళ గుణగణ ప్రహ్లాదవరదా
జగన్నాథా

విభక్త్యంతాలు:

జానకీశాయ

లలనా కావా లంఘిత వాద్యం
తిలకయితతదా తే నామాని

క్రియాంతాలు:

నాస్తి:- వ్యతిరిక్త సుఖం వక్తుం నాస్తి 244

భవతి:- హరేః పూజన మహో భవతి 3.38.

సంతి:- సూచయంతో వా శ్రోతుం న సంతి

భజే:- శుభాంకం లోకమయం భజే 4.327

ఈడే:- మహిరమణం స్థిరమీడే 5.107

అవ్యయాంతాలు:

చ:- స్థితి రియం కా విష్ణుసేవా పునశ్చ 2.342

సర్వనామాంతాలు:

కిమ్:- కిం వా కురు మమ ఖేలన మిహ కిమ్ 4.24

శబ్దాశ్రిత వర్ణాలు:

తి-తి:

తిరువేంకటగిరి నిధానం
పరమామృత రసభాగ్య మిదమ్
కరుణావరణం కమలాఘటనం
తిరొతిరొ తిత్తితి తితి తితి 4.461

నిబంధపదాలకున్న అవయవాలు ఉద్గ్రాహ, మేళాప, ధ్రువ, అంతరి, అభోగాలు. ఉద్గ్రాహమంటే ప్రబంధం మొదటి భాగం. అంటే అరంభం. ధ్రువం ప్రబంధం యొక్క ముగింపు. ఉద్గ్రాహ ధ్రువాలను కలిపేది మేళాపకం. అభోగమంటే ప్రబంధ రచయిత నామమో లేదా అంకితమిచ్చిన దేవతా నామమో ముద్రగా కలిగిన తుది భాగం. ఈ ధాతువుల కూర్పువల్ల ఏక ధాతుక, ద్విధాతుక, త్రిధాతుక, చతుర్ధాతుక నిబంధ పదాలేర్పడతాయి. ఉద్గ్రాహ. అభోగ పల్లవులతో కూడింది త్రిధాతుకం. ఉద్గ్రాహ, మేళాపక, ధ్రువ, అభోగాలతో కూడింది చతుర్ధాతుకం. అన్నమయ్యలో ఈ రెండే ఎక్కువ.

ఇంక చరణాలు పరిశీలిస్తే అన్నమయ్య సంస్కృత కీర్తనలో మూడు చరణాలే ఎక్కువ. కిం కరిష్యామి (5-168) అనే కీర్తనలో రెండే చరణాలు. భావయామి (5.79) లో కూడా రెండే. నమో నారాయణ (5.148) లోను, అహోసురతవిహారోయం (12.142) లో ఐదుచరణాలు కాని దశవిధాచరణం (3-440) లో మాత్రం 11 చరణాలు.

నిబంధపదంలో తప్పక నాలుగు పదాల చరణం ఒక్కటైనా ఉంటుంది. అట్టి చరణాల అర్థాన్ని వదలిపెట్టకుండా అన్నిటికి ఏక వాక్యత కూర్చేది పల్లవి. ఇది పల్లవి, శిఖాపదమని రెండు విధాలు. పదసమాన మాన పాద యుగ్మం కలది పల్లవి. ఏకపాద మాత్ర యైనది శిఖాపదం. తాళ్లపాకవారు పేర్కొన్న ఈ పల్లవియే తరువాతి కాలంలో తొలి చరణం పల్లవిగాను, మలి రెండు చరణాలు "అను పల్లవిగా" సంతరించుకొన్నది.పదం పాడేటప్పుడు ముందు ఉద్గ్రాహం (చరణం) పాడి పిదప పల్లవిని (ధ్రువం) అందుకొనే సంప్రదాయం తాళ్లపాక వారి కాలంలోనే వుందని చెప్పడానికి వీలుంది.తంజావూరు లోని తాళపత్ర ప్రతిలో పదాలు ఈ విధంగానే వ్రాయబడిందని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు తెలియజేశారు.

| | | |
|---|---|---|
| పల్లవి:- | ప్రలపనవచనైః ఫలమిహ కిం | 3.39 |
| | చలచల కుడ్యక్షాళనయా కిం | 5.140 |
| శిఖా:- | డోలాయాం చల డోలాయాం | 5.140 |
| | హరె డోలాయం | |

నిబంధ పదాలలోని అంగాలలో చివరిది ముద్ర. ఇది స్వ నామాంకితంగా లేదా దేవనామాంకితంగా వుండవచ్చు. అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు కావడం వల్ల వేంకటేశ్వర నామాన్ని ముద్రగా గ్రహించాడు. అయితే ఇది ఏకాకారంలో లేదు. వీటిని ప్రధానంగా

నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు.

**శ్రీ సహితం:-**

| | |
|---|---|
| శ్రీ వేంకటాద్రినివాస | 2.358 |
| శ్రీ వేంకటగిరిదేవ | 4.48 |
| శ్రీ వేంకటాచల శ్రీనివాసాయ | 5.148 |
| శ్రీ వేంకటాద్రి శ్రీనివాసాయ | 2 58 |
| శ్రీ వేంకట నగనాయక | 7.219 |
| శ్రీ వేంకటపతి చతుర | 22.419 |

**తిరుసహితం:**

| | |
|---|---|
| తిరువేంకటేశ | 3.665 |
| తిరువేంకటగిరిదేవ | 4.46 |
| తిరువేంకటాచల స్థితం | 5.79 |
| తిరువేంటాచల దేవం | 5.53 |
| తిరువేంకటాధిపతేః | 5.167 |
| తిరువేంకటగిరిహరేః | 3.384 |
| తిరువేంకటగిరి నిలయ | 11.3.111 |
| తిరువేంకటాధిపః | 5.167 |

**శ్రీ-తిరు రెండూవున్న ముద్రలు:**

| | |
|---|---|
| శ్రీ తిరువేంకటగిరి దివ్యవినోదీ | 4.45 |
| శ్రీ తిరువేంకటేశ | 11.5 |

**శ్రీ-తిరు విరహితాలయిన ముద్రలు:**

| | |
|---|---|
| వేంకటరాయ | 5.172 |
| వేంకటనాథ | 4.85 |
| వేంకటపతేః | 5.106 |
| వేంకటేశం | 4.327 |
| వేంకటవిభుః | 3.664 |
| వేంకటనాపగిరివరం | 2.310 |
| వేంకటగిరి సింహం | 2.160 |
| వేంకటగిరి రమణ | 11.42 |

పదాలలో దరువు, వాక్యం, అర్ధచంద్రిక, ఏల, గొబ్బిళ్ళు, చందమామలు పేర్కొనదగినవి. అన్నమయ్య సంస్కృత కీర్తనల్లో "అర్ధచంద్రిక" లు మాత్రమున్నాయి. ఉద్గ్రాహం, ధ్రువం, అభోగం, సగం పలికి పల్లవాన్ని కలిపి తానప్రతాన కాంచితంగా వ్రాయడం అర్ధచంద్రిక.

అతి శోభితేత యం రాధా
సతత విలాస వశా రాధా
దర్పక బలబోధా రాధా
తర్పణ గంధవిధా రాధా

దర్పయుత క్రోధా రాధా
దర్పక రసవేధా రాధా 4.48

ఈ అర్ధచంద్రికలో నాలుగు పాదాల చరణాలున్నాయి. పాదాంతంలో సమప్రాసలున్నాయి.

అష్టపది:

అష్టపదులనగానే జయదేవుని అష్టపదులే స్ఫురణకు రావడం

సహజం. అన్నమయ్య జయదేవుని గీత గోవిందప్రభావంతో ఎన్నో కీర్తనలు వ్రాశాడని ముందే విశదీకరించడం జరిగింది. కీర్తనాంశాల్లో గాకుండా కీర్తన నిర్మాణంలో కూడా జయదేవుని అనుసరించాడనడానికి "అష్టపది" ఒక ఉదాహరణ.

అహో సురత విహారోయం
సహజ పరాజయ శంకానాస్తి

యమునాకూలే సుమలతా గృహే
విమలసైకత విజనస్థలే
రమణీ రమణా రమతస్త్రయోః
ప్రమదస్య పరాత్పరం నాస్తి

రజనీ కావా ప్రాతః కింవా
త్యజనం భజనం తత్కింవా
విజయః కోపజయః కోవా
భుజ పరిరంభ స్ఫుటం నాస్తి

చీనాంశుక రంజిత మేఖలా వి
తానే జఘనం తరతిసతి
మాన వికలనే మానినీమణే
హీనాధిక పరిహృతిం నాస్తి

కిం వా మిళనం కిం వా మిళనం
త్వంవాహం వా తన్నాస్తి
సంవాదో వా సరసః కోవా
కిం వా వాచ్యా క్రియా నాస్తి

ఆదిదేవ పీతాంశుక బద్ధా

స్వేద సురభి కాశ్మీర జలం
పాదురంహ్యా లజ్జా వివశతయా
ఖేదేవ వచః కించిన్నాస్తి

వరకుచాగ్ర సంవ్యానం కరేణ
హరే పరం వరిహరతి సతి
వరసలోచనం చల వివశతయా
తరుణ్యాం చైతన్యం నాస్తి

సురతాంతశ్రమ సుఖం కింవా
వరలజ్జా సావా కావా
పరవశతను వైభవం కిం వా
విరతాం తయో వికృతిం నాస్తి

పరిమళ భరిత భ్రమర సుశీతల
వరమృదువాయౌ వాతిసతి
తిరువేంకటగిరి దేవ రాధయో
స్మరసరతి సుఖ శ్రాంతి ర్నాస్తి 12-78

పాడుకొనే పద్ధతి దృష్ట్యా పరిశీలించినపుడు తెలుగు సంకీర్తనల్లోలాగే సంస్కృత సంస్కృత సంకీర్తనల్లోను వ్యక్తిగేయాలు, యుగళ గేయాలు, సామూహిక గేయాలు కనిపిస్తాయి.

వ్యక్తి గేయాలు:

ఏవం శ్రుతిమతమిదమేవ 2.4

నమామ్యహం మానవసింహం 2.166

వందేహం జగద్వల్లభం దుర్లభం 2.244

అంజలి రంజలి రయం తే
కిం జనయసి మే ఖేదం వచనైః 2.358

సంవాదగేయాలు:

ఘటిత మృగమద మృత్తికాస్థాసకం
పటుశరీరే తే ప్రబలయతి
కుటిల తద్ఘన ఖార కుచపిలగ్నం వా
పిటరస్థలే మృత్తికా తులసి 3.665

బృందగేయాలు:

తత్తా తిగుడి దింధితక దింధిం
తిత్తి తిత్తితి తితి తితి తితి 4.46

దోలాయాం చల దోలాయాం 7.140

సుముఖ మంగళం శుభమంగళం
శమదమగత తే జయమంగళం 22.419

అన్నమయ్య సంస్కృత సంకీర్తనల్లో ప్రధానంగా పాడి-సామంతం, ముఖారి, బౌళి, శ్రీరాగం, కేదారగౌళ, రామక్రియ, ధన్యాసి రీతిగౌళ, కన్నడగౌళ, ఆహిరి, నాట, కురంజి, శుద్ధ వసంతం, సాళంగ నాట, బౌళి రామక్రియ, వరాళి, మాళవి, మంగళ కౌశిక, మలహరి, శంకరాభరణం, భైరవి, లలిత, భూపాలం, నాదరామక్రియ, కాంభోజి, శుద్ధవసంతం రాగాలు వాడినట్లు తెలుస్తున్నది. ప్రత్యేకించి బౌళి, కన్నడగౌళ, నాట, పాడి రాగాలకు విస్తృత వ్యాప్తి వున్నట్లు స్పష్టమవుతుంది.

తాళ్లపాక వారి రచనలు అర్థభావ ప్రధానమైనవి. త్యాగరాజ

దీక్షితాదుల వానివలె నాదరచనా ప్రధానములు గావు.

అన్నమయ్య శృంగార సంకీర్తనాంశం మూడువందల సంవత్స రాలకు క్షేత్రయ్యగా ఆ తరువాత నూరేళ్లకు ఆధ్యాత్మ కీర్తనాంశం త్యాగయ్యగా అవతరించినట్లు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అభి ప్రాయపడ్డారు.

క. పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమ రహస్యో
ద్భావనములు గాయకనిక
రావనములు తాళ్లపాక యన్నయ పదముల్

క. రంజనములు దుర్గుణ గుణ
భంజనములు విమల కమల భవజనకగుణా
సంజనములు సుజ్ఞాన ధ
నాంజనములు తాళ్లపాక యన్నయ పదముల్

క. వేదంబుల్ పౌరాణిక
వాదంబులు వర కవిత్వ వాణీ వీణా
నాదంబులు కృత సుజనా
హ్లాదంబులు తాళ్లపాక యన్నయ పదముల్

క. లక్షణములు పదకవితా
రక్షణములు వివిధ కుకవిరాజీ పదసం
మోక్షణములు వేంకటపతి
వీక్షణములు తాళ్లపాక విభు సత్కవితల్

# అనుబంధం

## (ప్రసిద్ధ సంస్కృత సంకీర్తనలు)

## లలిత

గోవిందాశ్రిత గోకుల బృందా
పావన జయజయ పరమానందా

జగదభిరామా సహస్ర నామా
సుగుణధామ సంస్తుత నామా
గగన శ్యామా ఘనరిపు భీమా
అగణిత రఘువంశాంబుధి సోమా

జననుత చరణా శరణ్య శరణా
దనుజ హరణ లలితస్ఫురణా
అనఘా చరణాయత భూభరణా
దినకర సన్నిభ దివ్యా భరణా

గరుడ తురంగా కారోత్తుంగా
శరధి భంగ ఫణిశయనంగా
కరుణాపాంగా కమలాసంగా
వర శ్రీ వేంకటగిరి పతి రంగా 21.260

## ధన్యాసి

దేవదేవం భజే దివ్య ప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం

రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజానుబాహుం నీలాభ్ర కాయం
రాజారి కోదండ రాజదీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం

నీలజీమూతసన్నిభ శరీరం ఘనవి
శాలవక్షసం విమల జలజనాభం

కాలాహి నగహరం ధర్మసంస్థాపనం
భూలలనాధిపం భోగిశయనం

పంకజాసన వినుత పరమ నారాయణం
శంకరార్చిత జనక చాపదళనం
లంకావిశోషణం లాలిత విభీషణం
వేంకటేశం సాధువిబుధ వినుతం

**4.299**

## నాదరామక్రియ

సకలం హే సఖి జానామి తత్
ప్రకటవిలాసం పరమం దధసే

అలికమృగమదమయ మషీ కలనో
జ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవిత మనసి ని
శ్చలతర మేఘశ్యామం దధసే

చారు కపోలస్థల కరాంచిత వి
చారం హేసఖి జానామి
నారాయణమహినాయక శయనం
శ్రీరమణం తవచిత్తే దధసే

ఘనకుచ శైలాగ్రస్థిత విధుమణి
జననం హే సఖి జానామి
కనదురసా వేంకటగిరి పతే
ర్వినుత భోగసుఖ విభవం దధసే **12-22**

## కన్నడగౌళ

కరుణానిధిం గదాధరం
శరణాగత వత్సలం భజే

శుకవరదం కౌస్తుభా భరణం
ఆరాధనప్రియ మనేకదం
సకల రక్షకం జయాధికం
సేవక పాలక మేవం భజే

ఉరగ శయనం మహోజ్జ్వలంతం
గరుడారూఢం కమనీయం
పరమపదేశం పరమం భవ్యం
హరిం దనుజ భయదం భజే

లంకాహరణం లక్ష్మీరమణం
పంకజ భవభవ ప్రియం
వేంకటేశం వేదనిలయం శు
భాంకం లోకమయం భజే

4.327

## పాడి

నారాయణ తే నమోనమో
నారదసన్నుత నమోనమో

మురహర భవహర ముకుంద మాధవ
గరుడ గమన పంకజనాభ
పరమపురుష భవ బంధ విమోచన
నరమృగ శరీర నమో నమో

జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహభవనుత చరణ యుగ
బలిబంధన గోపవధూవల్లభ
నలినోదర తే నమో నమో

ఆదిదేవ సకలాగమపూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీ వేంకట నాయక
నాదప్రియ తే నమో నమో 11-1-17

## లలిత


సుముఖ మంగళం శుభమంగళం
శమదమగత తే జయమంగళం

గంభీరగుణ కమలారమణా
శంభురాణినుత సకలలోకయుత
అంబోధిశయన హరినయనా
మాం భజతే జయమంగళం

కనకాంబర నిజఘన చరంణాంబర
దనుజశరణ హతదైత్యగణా
అనుపమచరిత అనంగ నిరత
సనకప్రియ తే జయమంగళం

చతుర్భుజాంగా సదయాపాంగ
గతనక్రాంబుజ కర చక్ర
శ్రిత శరణాగత శ్రీ వేంకటపతి
చతుర నమో తే జయమంగళం

22-419



**చదువు :** విద్వాన్ (తెలుగు) రాష్ట్ర భాషాప్రవీణ్ (హిందీ) ఎం. ఏ., (తెలుగు) ఎం. ఏ., (సంస్కృతం) దాక్షిణాత్య దేశచ్ఛందో రీతులు-తులనాత్మక పరిశీలన" అనే సిద్ధాంతవ్యాసానికి పి. హెచ్.డి "అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు-ఒక పరిశీలన" అనే అంశంపై మరొక సిద్ధాంత వ్యాస సమర్పణకు ప్రయత్నం.

**వృత్తి :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో రీడర్.

**రచనలు :**

**వెలుగు చూచినవి :**

సంగ్రహ వ్యాకరణము, వ్యాసమందారము, కాదంబిని, త్యాగరాజు, అన్నమయ్య–శ్రీపాదరాయలు, అన్నమయ్య–పురందరదాసు, అన్నమయ్య హనుమత్సంకీర్తనలు, అన్నమయ్య–ఓర్ అరిముగం (తమిళం) మరియు తెలుగు, తమిళ, కన్నడ పత్రికలలో దాదాపు యాభై వ్యాసాలు.

**అచ్చులో :**

రామదాసు–త్యాగయ్య, దాస సాహిత్య సమీక్ష, ఏకనాథుడు, నావ్యాసాలు.

**తెలిసినభాషలు:** తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, మరాఠీ, ఆంగ్లం, సంస్కృతం.

**అభిరుచులు :** కవితల్లడం, అనువాదరచనలు అందించడం.